www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -219 గురువారం 26 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## డాలర్‌పై రూపాయి జోరు..

### 8 నెలల గరిష్ఠానికి మారకం విలువ..

56 పైసలు బలపడి 92.29 స్థాయికి చేరిన మారకం విలువ

ఈ ఆర్థిక సంవత్సరంలో నమోదైన నష్టాలను చెరిపేసిన రూపాయి

విదేశీ పెట్టుబడులు, తగ్గిన క్రూడాయిల్ ధరలు ప్రధాన కారణాలు

2 శాతానికి పైగా లాభపడిన దేశీయ స్టాక్ మార్కెట్లు



2లో.

## ట్రంప్ సర్కారు కొత్త వడ్డింపులు..

భారత ఉత్పత్తులపై 17 శాతం అదనపు సుంకాల ప్రతిపాదన

వాణిజ్య ఒప్పందం కుదరకపోతే 25 శాతం వరకు పెరిగే అవకాశం

చైనా ఈయూ సహా మొత్తం 14 దేశాలపై యూఎస్ ట్రేడ్ పన్నుల భారం

అధిక పారిశ్రామిక ఉత్పత్తి అమెరికా మార్కెట్‌ను దెబ్బతీస్తోందన్న వాషింగ్టన్

ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం జనవరి నుంచి అమల్లోకి వచ్చే ఛాన్స్



2లో.



## మిస్ యూనివర్స్ గా ప్యూర్టోరికో సుందరి జెన్నిఫర్ బారెటో..

తల్లిగా కిరీటం గెలుచుకుని చరిత్ర

డొమినికన్ రిపబ్లిక్ సుందరి మెలిస్సా న్యూనెజ్ ఫస్ట్ రన్నరప్‌గా, వెనిజులాకు చెందిన క్లారా గోట్జ్ సెకండ్ రన్నరప్‌గా గుర్తింపు

భారత్ తరపున ప్రాతినిధ్యం వహించిన కజియా లిజ్ మెజో టాప్ 12కు చేరలేక నిష్క్రమణ

# పొల్ట్రీకి పెద్దపీట

## పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2026లో సీఎం రేవంత్‌రెడ్డి




### ఐటీతో పాటు ప్రాధాన్యతా రంగంగా గుర్తింపు..

పరిశ్రమలకు సింగిల్ విండో విధానంలో అనుమతులు

సోయా, మొక్కజొన్న సరఫరా సమస్యకు 48 గంటల్లో పరిష్కారం..

దరఖాస్తు చేసుకుంటే ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయింపుపై పరిశీలన

**హైదరాబాద్: నవంబర్ 25(ప్రజావినికిడి):**

తెలంగాణలో ఐటీ రంగంతో పాటు పౌల్ట్రీ పరిశ్రమకు కూడా ప్రాధాన్యత ఇస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కోళ్ల పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో ప్రారంభమైన పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో2026లో ఆయన పాల్గొని మాట్లాడారు. హైదరాబాద్‌లో గత 18 ఏళ్లుగా పౌల్ట్రీ ఎక్స్‌పో నిర్వహించడంమిగతా 2లో...

## 19,934 కోట్లతో ఐదు ప్రాజెక్టులు



### కేంద్ర క్యాబినెట్ ఆమోదం

దేశంలో మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక తయారీ, రవాణా రంగాల బలోపేతానికి కీలక నిర్ణయాలు

- తమిళనాడులో కామరాజర్ పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్
- అసోంలోని సిల్చార్ సమీపంలో కొత్త విమానాశ్రయం
- నిర్మాణ పరికరాల తయారీకి రూ.11 వేల కోట్ల ప్రోత్సాహక పథకం
- తపాలా సేవల ఆధునీకరణకు రూ.2,632 కోట్లు

**న్యూఢిల్లీ: నవంబర్ 25 (ప్రజావినికిడి):**

దేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పారిశ్రామిక తయారీ, రవాణా రంగాలను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం మొత్తం రూ.19,934 కోట్ల విలువైన ఐదు ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. దేశీయ తయారీ రంగాన్ని ప్రోత్సహించడంతోపాటు దిగుమతులపై ఆధారపడటాన్ని మిగతా 2లో...

## వన్యప్రాణులకు ముప్పు కలిగించొద్దు

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



**అమరావతి, నవంబర్ 25 (ప్రజావినికిడి):**

అటవీ ప్రాంతాల్లో నిఘా, గస్తీ మరింత పటిష్ఠం చేయాలని డిప్యూటీ సీఎం, అటవీశాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి రిజర్వ్ మిగతా 2లో...

## డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ

పెట్టుబడుల రక్షణ చట్టంపై బిల్లు పెట్టే అవకాశం

రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా పరిశ్రమలకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

ఇటీవల సీఐఐ సదస్సులో భారీ పెట్టుబడుల ఒప్పందాల నేపథ్యంలో కీలక అడుగు




**అమరావతి నవంబర్ 25(ప్రజావినికిడి):**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో కూటమి మిగతా 2లో...



## క్రీడా పోటీల నిర్వహణకు రూ.203 కోట్లు

### 'ఖేలో ఇండియా గేమ్స్'పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

డిసెంబర్ 11 నుంచి తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్

ఎల్బీ స్టేడియంలో ప్రారంభోత్సవం గచ్చిబౌలిలో ముగింపు వేడుకలు

ఉమ్మడి జిల్లాల వారీగా మంత్రులకు పర్యవేక్షణ బాధ్యతలు

తొలిసారి ప్రదర్శన క్రీడగా తెలంగాణ సంప్రదాయ కర్రసాము

క్రీడా పోటీల నిర్వహణకు రూ.203 కోట్లు కేటాయించిన ప్రభుత్వం

**హైదరాబాద్ నవంబర్ 25(ప్రజావినికిడి):**

తెలంగాణను అంతర్జాతీయ క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోందని, ఈ క్రమంలో రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' భవిష్యత్తుకు బలమైన పునాదిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరగనున్న ఈ ప్రతిష్ఠాత్మక క్రీడల ఏర్పాట్ల పురోగతిపై క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించారు. మిగతా 2లో...

## హెచ్‌ఎండీఏ ఆఫీసు ముట్టడి ఉద్రిక్తం

### ట్రక్ పార్క్ భూమిని అమ్మొద్దని విపక్ష నాయకుల డిమాండ్

తోపులాటతో గందరగోళం.. పలువురి అరెస్టు

విపక్ష నేతల అరెస్టులను ఖండిస్తున్నాం: కేటీఆర్

2లో.




## డ్రగ్స్ రహిత భారత్‌గా దేశాన్ని తీర్చిదిద్దాలి

డ్రగ్స్ తయారీదారులు, సరఫరాదారుల ఆట కట్టించాలి

నషా ముక్త్ భారత్ రాజకీయ కార్యక్రమం కాదు..

140 కోట్ల ప్రజల ఉద్యమం

హైదరాబాద్‌లో మూడు రోజుల

'నషా ముక్త్ భారత్ వాక్స్' పాదయాత్ర ప్రారంభం



2లో.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# పౌల్ట్రీకి పెద్దపీట

**మొదటిపేజీ తరువాయి**




, ప్రతి ఏడాది ఈ రంగం విస్తరిస్తుండటం అభినందనీయమన్నారు. తెలంగాణలో రోజుకు సుమారు 5.30 కోట్ల గుడ్ల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు గుడ్లు, చికెన్ అందిస్తున్నామని తెలిపారు.ఫ్యూచర్ సిటీలో బిల్టోనా యాప్ ద్వారా పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు ఇస్తున్నామని, ఇదే విధానాన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలకు విస్తరిస్తామని చెప్పారు. పౌల్ట్రీ పరిశ్రమల ఏర్పాటుకు ఎలాంటి జాప్యం లేకుండా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకుంటే ఫ్యూచర్ సిటీలో పౌల్ట్రీ రంగానికి భూమి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ రైతుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడంలో పౌల్ట్రీ రంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఈ పరిశ్రమలో ఒడిదుడుకులు సహజమని, సంక్షోభ సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దాణా తయారీకి అవసరమైన సోయాబీన్, మొక్కజొన్న సరఫరాలో ఎదురవుతున్న సమస్యలపై సమీక్ష నిర్వహించి 48 గంటల్లో సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రి వాకిటి శ్రీహరిని ఆదేశించారు.చిన్న, సన్నకారు పౌల్ట్రీ రైతులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పశుసంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో పౌల్ట్రీ రంగానికి విశేష అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు తక్కువ ధరలో పౌష్టికాహారం అందించడంలో కోడిగుడ్లు, చికెన్ కీలకమని చెప్పారు.

ఈ కార్యక్రమంలో పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, రఘువీర్‌రెడ్డి, ఈశ్వర్‌కుమార్, రాజ్‌కుమార్, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, ఇతర ప్రజాప్రతినిధులు, పౌల్ట్రీ రంగ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ‘మిస్ యూనివర్స్‘ విజేతగా ప్యూర్టోరికో సుందరి జెన్నిఫర్ బారెటో..

**న్యూఢిల్లీ: నవంబర్ 25 (ప్రజావినికిడి):**

ప్రపంచ ప్రఖ్యాత అందాల పోటీ ‘మిస్ యూనివర్స్ 2026’ విజేతగా ప్యూర్టోరికో భామ జెన్నిఫర్ బారెటో నిలిచారు. ప్యూర్టోరికోలోని శాన్ జువాన్ నగరంలో గల హోసే మిగ్యుల్ అగ్రెలోట్ కొలీజియంలో జరిగిన 75వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలేలో ఆమెను విశ్వసుందరి కిరీటం వరించింది. గత విజేత, మెక్సికోకు చెందిన ఫాతిమా బోష్ ఆమెకు కిరీటాన్ని అలంకరించారు. ఈ పోటీల్లో డొమినికన్ రిపబ్లిక్‌కు చెందిన మెలిస్సా న్యూనెజ్ ఫస్ట్ రన్నరప్‌గా, వెనిజులాకు చెందిన క్లారా గోట్జ్ సెకండ్ రన్నరప్‌గా నిలిచారు.27 ఏళ్ల జెన్నిఫర్ బారెటో వృత్తిరీత్యా సైకాలజిస్ట్, సోషల్ వర్కర్. గతంలో యూఎస్ ఆర్మీతో కలిసి కూడా పనిచేశారు. మిస్ యూనివర్స్ సంస్థ నిబంధనలను సవరించిన తర్వాత, ఒక బిడ్డకు తల్లిగా ఉండి ఈ కిరీటాన్ని గెలుచుకున్న మొట్టమొదటి మహిళగా ఆమె సరికొత్త చరిత్ర సృష్టించారు. అంతేకాకుండా, ప్యూర్టోరికో నుంచి ఈ టైటిల్ సాధించిన ఆరో మహిళగా ఆమె రికార్డుకెక్కారు. 75వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈసారి విజేతకు 3,150 వజ్రాలు, వైట్ గోల్డ్‌తో రూపొందించిన ప్రత్యేక కిరీటాన్ని అందించారు. ఈ మహా వేదికపై మొత్తం 116 దేశాల సుందరీమణులు పోటీపడ్డారు.







మరోవైపు, భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించిన కేరళకు చెందిన 19 ఏళ్ల కజియా లిజ్ మెజో టాప్ 12లోకి ప్రవేశించలేకపోయారు. ఈవెనింగ్ గౌన్ రౌండ్‌కు ముందే ఆమె పోటీ నుంచి నిష్క్రమించడంతో భారత అభిమానులకు నిరాశ ఎదురైంది. బెంగళూరులో లా చదువుతున్న కజియా, కేరళ నుంచి మిస్ యూనివర్స్ ఇండియా కిరీటం దక్కించుకున్న తొలి యువతిగా రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. మిస్ యూనివర్స్ టైటిల్ గెలుచుకున్న జెన్నిఫర్ బారెటో త్వరలోనే పలు అంతర్జాతీయ సేవా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

## క్రీడా పోటీల నిర్వహణకు రూ.203 కోట్లు

**మొదటిపేజీ తరువాయి**

యువతలో నూతన ఉత్సాహం నింపేలా డిసెంబర్ 11న ఖేలో ఇండియా పోటీలను అత్యంత అట్టహాసంగా ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రారంభ వేడుకలను హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో, ముగింపు వేడుకలను గచ్చిబౌలి స్టేడియంలో ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్ అంతటా క్రీడా వాతావరణం, క్రీడా స్ఫూర్తి ఉట్టిపడేలా విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. స్టేడియంల పునరుద్ధరణ, క్రీడా ప్రాంగణాల ఆధునికీకరణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని, పనులపై విజిలెన్స్ నిఘా ఉంచాలని ఆదేశించారు.

ఈ భారీ క్రీడా ఈవెంట్ ప్రారంభ, ముగింపు వేడుకల పర్యవేక్షణ బాధ్యతలను మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అప్పగించనున్నారు. పోటీలు హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లోనూ జరుగుతున్నందున, జిల్లాల వారీగా మంత్రులకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలు కేటాయించారు. హైదరాబాద్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్, రంగారెడ్డికి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మహబూబ్‌నగర్‌కు జూపల్లి కృష్ణారావు, వరంగల్‌కు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, కరీంనగర్‌కు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఖమ్మంకు తుమ్మల నాగేశ్వరరావు, నిజామాబాద్ జిల్లాకు ప్రభుత్వ సలహాదారు పి. సుదర్శన్ రెడ్డి పర్యవేక్షకులుగా వ్యవహరించనున్నారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే సంప్రదాయ యుద్ధ కళ ‘కర్రసాము‘ ఈ పోటీల్లో తొలిసారిగా ప్రదర్శన క్రీడగా అడుగుపెడుతుండటం విశేషం. ఈ సందర్భంగా కర్రసాము ప్రత్యేక బ్రోచర్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. జాతీయ వేదికపై కర్రసాముకు తగిన గుర్తింపు కల్పించడం వల్ల ఈ ప్రాచీన కళకు, స్థానిక క్రీడాకారులకు గొప్ప ప్రోత్సాహం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ నెలాఖరు నాటికి స్టేడియాల మరమ్మతులు, మౌలిక వసతుల పనులతో పాటు 27 క్రీడలకు అవసరమైన అత్యాధునిక క్రీడా పరికరాలు సిద్ధం చేయనున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. పోటీలు నిర్వహించే మొత్తం ప్రాంగణాల్లో ఇప్పటికే 14 స్టేడియాలలో పనులు పూర్తికాగా, మిగిలిన 6 చోట్ల నెలాఖరులోగా పూర్తి చేస్తామన్నారు. ఈ క్రీడల్లో పాల్గొనేందుకు తెలంగాణకు చెందిన 1,334 మంది అథ్లెట్లకు ప్రత్యేక శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న 861 మంది క్రీడాకారులు, కోచ్‌లకు అవసరమైన అధునాతన స్పోర్ట్స్ కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది.ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజయవంతమైన నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 203 కోట్లు వెచ్చిస్తుండగా, కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 21 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కేవలం స్టేడియాల ఆధునీకరణ, అంతర్జాతీయ స్థాయి పరికరాల కొనుగోలు కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ. 120 కోట్లు కేటాయించింది. భవిష్యత్తులో తెలంగాణ అంతర్జాతీయ ఈవెంట్లకు వేదిక కావాలనే దీర్ఘకాలిక వ్యూహంతో ఈ క్రీడా ప్రాంగణాలను శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నారు.

## హెచ్ఎండీఏ ఆఫీసు ముట్టడి ఉద్రిక్తం

**కూకట్‌పల్లి/ నవంబర్ 25(ప్రజావినికిడి):**

మూసాపేట ట్రక్ పార్క్ భూమిని అమ్మొద్దంటూ విపక్ష నేతలు చేపట్టిన హెచ్ఎండీఏ కార్యాలయ ముట్టడి ఉద్రిక్తతకు దారి తీసింది. బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, న్యూడెమోక్రసీ నేతలతోపాటు కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు బుధవారం అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయాన్ని ముట్టడించేందుకు భారీగా తరలివచ్చారు. ట్రక్ పార్క్ భూములు అమ్మొద్దంటూ నినాదాలు చేశారు. నాయకులు, కార్యకర్తలను బారికేడ్ల వద్దే పోలీసులు అడ్డుకోగా.. అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఒక సందర్భంలో అక్కడ తోపులాట చోటు చేసుకోవడం.. గందరగోళానికి దారి తీసింది. ముట్టడికి యత్నించిన వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని సమీప పోలీసుస్టేషన్లకు తరలించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పలువురు వామపక్ష నేతలను మధురానగర్ పోలీసు స్టేషన్‌కు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు తదితరులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలించారు.అనంతరం పోలీసుస్టేషన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ ట్రక్ పార్క్‌కు సంబంధించిన 3.15 ఎకరాల భూమిని 1980-81లో నాటి ప్రభుత్వం సేకరించిందని గుర్తు చేశారు. ఆ భూమిని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలే తప్ప.. అమ్మకానికి పెట్టాలనుకోవడం సరికాదన్నారు. ట్రక్ పార్క్ భూముల అమ్మకాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తమ గొంతులు నొక్కినా.. ప్రజాక్షేత్రంలో పోరాటాలు కొనసాగిస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ప్రజలే కాంగ్రెవీసకు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. భూముల వేలాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపిన విపక్ష నేతలను అరెస్టు చేయడం కాంగ్రెస్ నిరంకుశ వైఖరికి నిదర్శనమని, ఈ చర్యను ఖండిస్తున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు.ప్రజా సమస్యలపై గొంతెత్తిన నేతలను పోలీసులతో అణచివేయాలని చూడటం సిగ్గుచేటని ‘ఎక్స్’ వేదికగా విమర్శించారు. ట్రక్ పార్క్ భూములు వేలాది మంది లారీ డ్రైవర్లు, రవాణా కార్మికులు, చిరు వ్యాపారుల జీవనోపాధితో ముడిపడి ఉన్న ప్రజా ఆస్తి అని, ఆ భూములను వేలం వేయొద్దని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించొద్దని ఢిల్లీలో రాహుల్‌గాంధీ నీతులు చెప్తుంటే, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి భూములు వేలం వేస్తుండడం సిగ్గుచేటని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ట్రక్ పార్క్ వేలాదిమంది జీవితాలు, జీవనోపాధితో ముడిపడిన అంశమని, ప్రజల జీవితాలతో చెలగాటమాడొద్దని ఎక్స్ వేదికగా ప్రభుత్వానికి హితవు చెప్పారు. ఈ విషయంలో కాంగ్రెస్ హైకమాండ్ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు.

## డ్రగ్స్ రహిత భారత్‌గా దేశాన్ని తీర్చిదిద్దాలి

**హైదరాబాద్‌లో మూడు రోజుల**
**‘నషా ముక్త్ భారత్ వాక్స్’ పాదయాత్ర ప్రారంభం**

**అంబర్‌పేట:హైదరాబాద్ నవంబర్ 25(ప్రజావినికిడి):**

దేశంలో మాదకద్రవ్యాల తయారీ, అక్రమ సరఫరా కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. డ్రగ్స్ తయారీదారులు, సరఫరాదారుల ఆట కట్టించి దేశాన్ని డ్రగ్స్ రహిత భారత్‌గా తీర్చిదిద్దాలని, ముఖ్యంగా యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. నషా ముక్త్ భారత్ అనేది రాజకీయ కార్యక్రమం కాదని, 140 కోట్ల మంది ప్రజల భాగస్వామ్యంతో సాగాల్సిన ఉద్యమమని పేర్కొన్నారు. డ్రగ్స్ రహిత హైదరాబాద్, డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యంగా కిషన్‌రెడ్డి నాయకత్వంలో చేపట్టిన మూడు రోజుల ‘నషా ముక్త్ భారత్ హైదరాబాద్ వాక్స్’ పాదయాత్ర బుధవారం హైదరాబాద్‌లోని అంబర్‌పేట మహంకాళి ఆలయం నుంచి ప్రారంభమైంది. సినీ హీరో విక్టరీ వెంకటేశ్‌తో కలిసి కేంద్రమంత్రి పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ‘నే నో టు డ్రగ్స్’ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు.జాతీయ జెండా చేతబూనిన కిషన్‌రెడ్డి తిలక్‌నగర్, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, హిందీ మహావిద్యాలయం, ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ, ఇఫ్లూ మీదుగా ముషీరాబాద్ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ యువతే దేశానికి అతిపెద్ద బలమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

## డిసెంబర్ 5 నుంచి ఏపీ శాసనసభ

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ‘పెట్టుబడుల రక్షణ చట్టం‘ (ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్) బిల్లును సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. ఈ సమావేశాలు దాదాపు 15 రోజుల పాటు కొనసాగవచ్చని తెలుస్తోంది.రాష్ట్రానికి వచ్చే పారిశ్రామిక పెట్టుబడులకు రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా చట్టపరమైన భరోసా కల్పించడమే ఈ నూతన చట్టం ప్రధాన ఉద్దేశం. రాష్ట్రంలో అధికారం మారినప్పుడు... పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలు, భూ కేటాయింపుల విషయంలో భవిష్యత్తులో విధానపరమైన ఆకస్మిక మార్పులు జరగకుండా నిరోధించేందుకు ఈ బిల్లును రూపొందిస్తున్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ తరహా చట్టాన్ని తీసుకొస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు.ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో రికార్డు స్థాయిలో దాదాపు రూ. 9.89 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలు కుదిరాయి. ఈ నేపథ్యంలో పారిశ్రామికవేత్తల్లో మరింత నమ్మకాన్ని పెంచేందుకు ఈ చట్టాన్ని వేగంగా తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయమై మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... “చాలా మంది పెట్టుబడిదారులు దీనిపై మమ్మల్ని అడిగారు. ప్రభుత్వం దీనిపై తీవ్రంగా ఆలోచిస్తోంది, కచ్చితంగా చట్టం తెస్తాం“ అని పేర్కొన్నారు.మరోవైపు రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి, నిర్మాణ పనుల పురోగతి, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై కూడా ఈ అసెంబ్లీ సమావేశాల్లో సమగ్రంగా చర్చించనున్నారు.

## డాలర్‌పై రూపాయి జోరు..

### 8 నెలల గరిష్ఠానికి మారకం విలువ..

**న్యూఢిల్లీ: నవంబర్ 25(ప్రజావినికిడి):**

భారత కరెన్సీ రూపాయి ట్రేడింగ్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే ఏకంగా 56 పైసలు బలపడి 8 నెలల గరిష్ఠ స్థాయికి చేరుకుంది. ఇంటర్‌బ్యాంక్ మార్కెట్‌లో ఒక దశలో 92.29 వద్ద ట్రేడ్ అయింది. ఈ భారీ పెరుగుదలతో, 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఎదుర్కొన్న నష్టాలన్నింటినీ రూపాయి పూర్తిగా చెరిపేసినట్లయింది. ఉదయం 92.65 వద్ద ట్రేడింగ్ ప్రారంభించిన రూపాయి, క్రమంగా బలపడి 92.29కి చేరింది. ఈ ఏడాది మార్చి 16న నమోదైన 92.28 తర్వాత రూపాయికి ఇదే అత్యంత గరిష్ఠ స్థాయి. రూపాయి పుంజుకోవడానికి అనేక సానుకూల అంశాలు దోహదం చేశాయి. ముఖ్యంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లలో సెన్సెక్స్, నిఫ్టీ 2 శాతానికి పైగా లాభపడటం దీనికి ప్రధాన కారణమైంది.విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) భారత మార్కెట్లలోకి మళ్లీ భారీగా పెట్టుబడులు పెట్టడం రూపాయికి కలిసొచ్చింది. నివేదికల ప్రకారం, నవంబర్ నెలలో రికార్డు స్థాయిలో 14.28 బిలియన్ డాలర్ల పెట్టుబడులను భారత స్టాక్స్‌లో పెట్టారు. దీనికి తోడు అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడం కూడా సానుకూలంగా మారింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్ ధర 90 డాలర్ల దిగువకు పడిపోవడం, ఈ నెలలో దాదాపు 24 శాతం తగ్గడంతో భారత్ దిగుమతుల భారం తగ్గనుంది. ఈ కారణాలన్నీ రూపాయికి డిమాండ్ పెంచి, దాని విలువను పటిష్ఠం చేశాయి. మార్కెట్లలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ స్టాక్స్ లాభాలకు ప్రధాన కారణంగా నిలిచాయి

## ట్రంప్ సర్కారు కొత్త వడ్డింపులు..

### భారత ఉత్పత్తులపై 17 శాతం అదనపు సుంకాల ప్రతిపాదన

**న్యూఢిల్లీ: నవంబర్ 25 (ప్రజావినికిడి):**

భారతదేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై 17 శాతం అదనపు సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. తమ ప్రధాన వాణిజ్య భాగస్వామ్య దేశాల్లో నెలకొన్న మితిమీరిన తయారీ సామర్థ్యం, అవసరానికి మించిన ఉత్పత్తిని నియంత్రించే లక్ష్యంతో అమెరికా కొత్త వాణిజ్య విధానాన్ని (ట్రేడ్ ఫ్రేమ్‌వర్క్) ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్‌తో సహా మొత్తం 14 దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ సరికొత్త పన్నుల విధానాన్ని రూపొందించింది.అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) కార్యాలయం విడుదల చేసిన ప్రాథమిక జాబితా ప్రకారం, భారత ఎగుమతులపై గరిష్ఠంగా 25 శాతం వరకు సుంకాలు పడే ప్రమాదం ఉంది. అయితే, ట్రంప్ ప్రభుత్వంతో న్యూఢిల్లీ సమగ్ర వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంటే ఈ రేటును 17 శాతానికి తగ్గిస్తామని స్పష్టం చేసింది. ఈ కొత్త వాణిజ్య చర్యల పరిధిలోకి భారత్‌తో పాటు చైనా, యూరోపియన్ యూనియన్ (ఈయూ), జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, బంగ్లాదేశ్ వంటి ప్రధాన ఆర్థిక వ్యవస్థలను చేర్చారు.మార్కెట్ వాస్తవ డిమాండ్‌కు మించి ఇతర దేశాల ప్రభుత్వాలు తమ పరిశ్రమల్లో అధిక సామర్థ్యాన్ని, మితిమీరిన ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నాయా అనే అంశంపై యూఎస్‌టీఆర్ గత మార్చి నెలలో దర్యాప్తు ప్రారంభించింది. కొన్ని దేశాలు అవసరానికి మించి వస్తువులను ఉత్పత్తి చేసి గ్లోబల్ మార్కెట్లలో డంపింగ్ చేస్తుండటం వల్ల ధరలు భారీగా పడిపోతున్నాయని అమెరికా వాదిస్తోంది. ఇది ప్రపంచ వాణిజ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేయడమే కాకుండా, అమెరికాలోని స్థానిక తయారీ రంగానికి తీవ్ర నష్టం కలిగిస్తోందని, స్వదేశీ కంపెనీలు పోటీ పడటం కష్టతరంగా మారుతోందని వాషింగ్టన్ ఆరోపిస్తోంది. ఈ విచారణ పరిధిలో బ్యాటరీలు, సిమెంట్, రసాయనాలు, ప్రాసెస్డ్ ఫుడ్ వంటి విస్తృత రంగాలు ఉన్నాయి.అయితే, ఈ ప్రతిపాదిత సుంకాలు తక్షణమే అమల్లోకి రావడం లేదు. తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు వ్యాపార వర్గాలు, పరిశ్రమల భాగస్వాముల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు యూఎస్ యంత్రాంగం ప్రజాభిప్రాయ సేకరణను ప్రారంభించింది.

## 19,934 కోట్లతో ఐదు ప్రాజెక్టులు

**మొదటిపేజీ తరువాయి**

తగ్గించడం, రవాణా సౌకర్యాలను విస్తరించడం ఈ నిర్ణయాల ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియా సమావేశంలో మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. నిర్మాణ, మౌలిక సదుపాయాల పరికరాల దేశీయ తయారీని ప్రోత్సహించేందుకు ఎనిమిదేళ్ల కాలపరిమితితో రూ. 11 వేల కోట్ల పథకానికి ఆమోదం తెలిపారు. ఇందులో భాగంగా టన్నెల్ బోరింగ్ యంత్రాలు, ఎక్స్‌కవేటర్లు, క్రేన్లు, భారీ ట్రక్కులు, లోడర్లు, డ్రిల్లింగ్ యంత్రాల తయారీకి ప్రోత్సాహకాలు అందించనున్నారు.ఈ పథకం ద్వారా రూ. 21 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించవచ్చని కేంద్రం అంచనా వేస్తోంది. అలాగే రూ. 22,500 కోట్ల విలువైన దిగుమతులకు ప్రత్యామ్నాయంగా దేశీయ ఉత్పత్తులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. ఎగుమతులు సైతం దాదాపు నాలుగు రెట్లు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది.తమిళనాడులోని కామరాజర్ పోర్టులో రెండో కంటైనర్ టెర్మినల్ ఏర్పాటుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో సముద్ర రవాణా, వాణిజ్య కార్యకలాపాలకు మరింత ఊతం లభించనుంది.అసోంలోని సిల్చార్ సమీపంలో కొత్త విమానాశ్రయ నిర్మాణానికి ఆమోదం తెలపడం ద్వారా ఈశాన్య ప్రాంతంలో విమానయాన సౌకర్యాలను విస్తరించేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది.తపాలా శాఖ సేవలను ఆధునీకరించేందుకు మరో రూ. 2,632 కోట్లను కేటాయించనున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి తపాలా సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడమే ఈ నిర్ణయం వెనుక ఉద్దేశం.

మొత్తంగా ఈ ఐదు ప్రాజెక్టులు దేశ ఆర్థిక వ్యవస్థకు, పారిశ్రామిక రంగానికి, రవాణా మౌలిక సదుపాయాలకు ప్రోత్సాహాన్నిస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

## వన్యప్రాణులకు ముప్పు కలిగించొద్దు

**మొదటిపేజీ తరువాయి**

ఫారెవీస్ట్‌లో సిబ్బంది చేపట్టిన ప్రత్యేక పెట్రోలింగ్‌లో 69 వేట ఉచ్చులను గుర్తించి, తొలగించారు. వాహనాల బ్రేక్ వైర్లతో ఉచ్చులు ఏర్పాటు చేయడాన్ని గుర్తించారు.

దీంతో బ్రేక్ వైర్లు దుర్వినియోగం కాకుండా ఆటోమొబైల్ షాపుల యజమానులు, మోటార్ మెకానిక్‌లకు అవగాహన కల్పించాలని పవన్‌కల్యాణ్ బుధవారం అధికారులను ఆదేశించారు. వన్యప్రాణుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో స్థానిక ప్రజలు కూడా భాగస్వాములై ఇలాంటి చర్యలను నిరోధించాలని కోరారు. మారేడుమిల్లి ఫారెస్ట్ ఉచ్చులు తొలగించిన సిబ్బందిని అభినందించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

గురువారం 26 నవంబర్ 2026

# కొండాపూర్ లో దోపిడీ కేసును చేధించిన ఘట్కేసర్ పోలీసులు

## చాకచక్యంగా వ్యవహరించి పది మందిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన ఘట్కేసర్ సీఐ పెండ్యాల కిరణ్





**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**
మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ పిఎస్ పరిధి కొండాపూర్ లో ఈ నెల పద్నాలుగున భారీ చోరీకి పాల్పడ్డ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు.ఓ ఇంట్లో దోపిడీకి పాల్పడ్డ పది మంది దొంగలను అరెస్ట్ చేసి పది తులాల బంగారం,ఇరవై నాలుగు తులాల వెండి,రెండు ఐ ఫోన్లు,యాభై మూడు వేల రూపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే... మల్కాజిగిరి పోలీస్ కమీషనరేట్ ఘట్కేసర్ పిఎస్ పరిధి కొండాపూర్ లేక్ వ్యూ ఎంక్లేవ్ వైష్ణవి రెసిడెన్సీ లో నివాసం ఉండే నవీన్ కుమార్ ఈనెల పద్నాలుగున తన భార్య, కుమార్తె తో కలిసి ఇంటికి తాళం వేసి ప్రమాదానికి గురైన బోడుప్పల్ లోని స్నేహితుడి ఇంటికి వెళ్లారు. కాగా పడ్డెనిమిదిన తిరిగి ఇంటికి రాగా కిటికీ తలుపులు విరగ్గొట్టి ఇంట్లో దోపిడీ జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుని ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి ఘట్కేసర్ లోని వివిధ ప్రాంతాలకు చెందిన సామేల్ అలియాస్ నాని (19),పిట్టల ఉమర్ అలియాస్ షేక్ ఉమర్ (18),షేక్ సద్దాం షరీఫ్ (21),పిట్టల పాపిత (33), మార్కుల సాయికుమార్ (21), ఎస్‌డీ.సిద్ధిఖ్ (22),నోకటాల మోతీలాల్ (29), నోకటాల శబ్బు (24),శక్తి విశాల్ (24),గణసాల రైలన్ మాక్స్ (20)పది మంది పాత నేరస్తులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామనీ, మరో నిందితుడు మానుసాల వెంకటేశ్ (24) పరారీలో ఉన్నట్లు సీఐ కిరణ్ వెల్లడించారు. ఈ ముఠాలో ఏ-1 కె.సామేల్ అలియాస్ నాని, ఏ-2 పిట్టల ఉమర్ ప్రధాన నిందితులుగా వ్యవహరించినట్లు పోలీసులు తెలిపారు. వీరిద్దరూ చోరీలకు పాల్పడి, అపహరించిన నగలను మిగిలిన నిందితుల ద్వారా విక్రయించేవారని ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు. ఏ-1,ఏ-2 నిందితులు గతంలోనూ ఆస్తి సంబంధిత నేరాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ వద్ద కదులుతున్న రైళ్లలో ప్రయాణికుల మొబైల్ ఫోన్లను అపహరించిన కేసుల్లోనూ వీరికి సంబంధం ఉన్నట్లు వెల్లడించారు. సద్దాం గతంలో పోక్సో కేసులో శిక్ష అనుభవించి వచ్చినట్లు తెలిపారు. ప్రజలు ఇళ్ల నుండి బయటికి వెళ్ళేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, విలువైన వస్తువులను ఇంట్లో పెట్టవద్దనీ, స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఘట్కేసర్ సీఐ కిరణ్ పిలుపునిచ్చారు.

# ఎల్ ఓ సి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**చంపాపేట్ డివిజన్ పరిధిలోని పోచమ్మ గడ్డ నందు నివాసం ఉండే బాలకృష్ణ కుమారుడు అభిరామ్(16 సంవత్సరాలు)పుట్టినప్పటి నుంచి వినికిడి సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి యొక్క కుటుంబ సభ్యులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని సంప్రదించారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి వారి చికిత్సకు అవసరమైన వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ద్వారా దరఖాస్తు చేయించారు.దానికి గాను వినికిడి సమస్య తీవ్రంగా ఉన్నవారికి వినడానికి సహాయపడే ఒక ప్రత్యేకమైన ఎలక్ట్రానిక్ పరికరం కోసం ఆరు లక్షల రూపాయలు(6,00,000)ఎల్.ఓ.సీ.(LOC) మంజూరు కాగా,ఆ చెక్కును బాధిత తండ్రి బాలకృష్ణ కు అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేద ప్రజలకు సేవ చేయడం తమకు ఎంతో సంతృప్తిని ఇస్తుందని తెలిపారు.తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక మంది పేద కుటుంబాలకు సహాయం చేసే అవకాశం లభించిందన్నారుఅనంతరం బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, తమ కుమారుడి ఆరోగ్య సమస్య విషయంలో సుధీర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సహాయం చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.మా కొడుకు చికిత్స కోసం చెక్కు అందించడంలో ఆయన చూపిన మద్దతు జీవితాంతం మరువలేమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాకేష్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భారస నాయకులు

## గౌరిదేవి రాజును పరామర్శించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**ఎల్బీనగర్ నియోజకవర్గంలోని చంపాపేట డివిజన్, కర్మన్‌ఘాట్ పాత గ్రామానికి చెందిన గౌరీదేవి రాజు మంగళవారం సాయంత్రం కార్యాలయం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో నాగోల్ మార్గమధ్యంలో అకస్మాత్తుగా తీవ్రమైన ఛాతినొప్పికి గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికుల సహకారంతో వెంటనే కామినేని ఆసుపత్రికి తరలించారు. రాజు ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు వెంటనే స్పందించి గుండెపోటుగా అనుమానించి అత్యవసర చికిత్స అందించారు. అనంతరం విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు.
ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి బుధవారం రోజు కామినేని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న రాజు ని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి రాజు కు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకునేలా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉమ మహేశ్వరరావు,డాక్టర్లు పాల్గొన్నారు

# లేమామిడిలో ఉచిత కంటి వైద్య శిబిరం

## రవీందర్ యాదవ్‌కు ఆహ్వానం



**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని,కేశంపేట మండలం లేమామిడి గ్రామం అలాగే పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో శంకర నేత్రాలయ ఎంఈయూఎస్‌యూహైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికిహాజరుకావాల్సిందిగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్‌ను శిబిర నిర్వాహకులు ప్రత్యేకంగా ఆహ్వానించారు.ఈ మేరకు మాజీ సర్పంచ్ శ్రీశైలం గౌడ్,మండల సీనియర్ నాయకులు గోగు వెంకట్ నారాయణరెడ్డి,అమర్నాథ్ రెడ్డి, బాసిద్ తదితరులు రవీందర్ యాదవ్‌ను కలిసి శిబిర నిర్వహణ,అందించనున్న వైద్య సేవల వివరాలను వివరించారు. అనంతరం ఆహ్వాన పత్రికను అందజేసి కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.ఈ శిబిరం ద్వారా కంటి సమస్యలతో బాధపడుతున్న పేద,మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.గ్రామీణ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

# పట్టణంలో రెండో విడత 495 మందికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల మంజూరు

## లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన మున్సిపల్ చైర్మన్,నాయకులు





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో రెండో విడతలో భాగంగా షాద్‌నగర్ పట్టణానికి మంజూరైన 495 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్,తహసిల్దార్ నాగయ్య పలువురు కౌన్సిలర్లు పాల్గొని లబ్ధిదారులకు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా ఈ పథకం ఉపయోగపడుతుందని కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు మున్సిపల్ కౌన్సిలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి నేతృత్వంలో నషా ముక్త్ భారత్ పాదయాత్రలో పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి






**హైదరాబాద్,(ప్రజావినికిడి):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి నేతృత్వంలో హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు (నవంబర్ 25,26,27 తేదీల్లో) నిర్వహిస్తున్న 'నషా ముక్త్ భారత్,డ్రగ్స్ ఫ్రీ ఇండియా' పాదయాత్రలో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.
అంబర్‌పేటలో ప్రారంభమైన ఈ పాదయాత్రను ప్రముఖ సినీ నటుడు విక్టరీ వెంకటేష్ ప్రారంభించారు. జాతీయ జెండాలను చేతబూని,డ్రగ్స్ రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా వేలాది మంది యువత, విద్యార్థులు, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాదయాత్రలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి స్వయంగా పాదయాత్రకు నాయకత్వం వహిస్తూ ముందుండి నడుస్తున్నారు. ఆయన నేతృత్వంలో మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం కొనసాగనుంది.
ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎంపీలు ఈటల రాజేందర్,కొండా విశ్వేశ్వర్ రెడ్డి,బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్కా కొమరయ్య తదితర నాయకులు పాల్గొన్నారు. పలువురు విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్లు, వై.ఎల్.శ్రీనివాస్, నాగరాజు కుమార్ తదితర ప్రొఫెసర్లు, విద్యావేత్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు, పాఠశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,
నేటి యువత, విద్యార్థులు మాదకద్రవ్యాలకు బానిసలై తమ విలువైనజీవితాలను,భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.డ్రగ్స్ వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా దేశ యువశక్తిని నిర్వీర్యం చేస్తోందన్నారు. డ్రగ్స్ సరఫరా,విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, వ్యసనానికి గురైన వారిని ఆ బానిసత్వం నుంచి బయటపడేసేందుకు కుటుంబ సభ్యులు,ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, సమాజం అండగా నిలవాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల వలయం, అలవాట్లపై నిరంతరం అవగాహన కలిగి ఉండాలని సూచించారు.
డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.
2047 నాటికి వికసిత్ భారత్ సాధించాలన్న ప్రధానమంత్రి సంకల్పం నెరవేరాలంటే ఆరోగ్యవంతమైన,శక్తివంతమైన,బాధ్యతాయుతమైన యువత దేశానికి అవసరమని అన్నారు.
ఆరోగ్యవంతమైన యువత బలమైన భారతదేశం. డ్రగ్స్‌కు దూరంగా ఉండండి,జీవితానికి దగ్గరగా ఉండండి.నషా ముక్త్ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం

## ముఖ్య అతిథిగా మండల అధ్యక్షులు ఎన్. చంద్రశేఖర్






**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని చౌదరి గూడెం మండల పరిధిలోని గాలిగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎన్.చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.గత ప్రభుత్వ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో ఆశలు చూపి మోసం చేశారే తప్ప, ఒక్క పేదవాడికి కూడా న్యాయం జరగలేదు.నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోంది.ఇందిరమ్మ రాజ్యంలో పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీక ఈ ఇందిరమ్మ ఇళ్లు.గాలిగూడెం గ్రామంలో నేడు ఒక పేద కుటుంబం సొంతింట్లోకి అడుగుపెట్టడం ఎంతో సంతోషంగా ఉంది.ఎటువంటి పైరవీలకు తావులేకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందించే బాధ్యత మా ప్రభుత్వానిది.మండలంలోని ప్రతి గ్రామంలో పేదల కళ్లలో ఆనందం చూడటమే మా ధ్యేయం..అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యం,ఉప సర్పంచ్ బలరాం,మాజీ సర్పంచ్ పాలమూరు యాదయ్య, గ్రామ అధ్యక్షులు మల్లేష్,మండల బీసీ సెల్ అధ్యక్షులు వెంకట్రాములు,వివిధ గ్రామాల సర్పంచులు పిఎసిఎస్ వైస్ చైర్మన్ గొబ్రు నాయక్,మాజీ సర్పంచులు బాలరాజ్,గోపాల్,సలీమ్ పాల్గొన్నారు.

వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షులు దామోదర్,కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు ఎల్లేశ్వర్,రాష్ట్ర ఎస్సీ సెల్ కో-కన్వీనర్ అశోక్,మాజీ ఎంపీటీసీ సత్యం రెడ్డి, తాలూకా మహిళా అధ్యక్షురాలు పిట్ట రజిత వెంకటయ్య,పెద్ద ఎల్కిచెర్ల గ్రామ అధ్యక్షులు శ్రీనివాస్, వీరన్నపేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గుర్రం యాదయ్య, నాయకులు పాపయ్య,సుధాకర్, ఆజం,శ్రీకాంత్,శేఖర్,యాదయ్య భీములు తదితరులు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# 15 రోజుల ఉమ్రా యాత్ర ముగించుకుని స్వదేశానికి చేరుకున్న 60 మంది

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కుటుంబ సభ్యులు, బంధువుల ఘన స్వాగతం..

## మక్కాలో వివాహ వేడుక కోసం ఒకే కుటుంబానికి చెందిన 25 మంది యాత్ర





**శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 25,** హైదరాబాద్ నుంచి పవిత్ర ఉమ్రా యాత్రకు వెళ్లిన 60 మంది యాత్రికులు తమ 15 రోజుల యాత్రను విజయవంతంగా ముగించుకుని బుధవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తిరిగి చేరుకున్నారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలో కుటుంబ సభ్యులు, బంధువులు వారికి పూలతో ఘన స్వాగతం పలికారు.తమ ఆత్మీయులు క్షేమంగా తిరిగి రావడంతో కుటుంబాల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి.ఈ ఉమ్రా యాత్రలో ఒకే కుటుంబానికి చెందిన 25 మంది పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మక్కాలో నిర్వహించిన వివాహ వేడుకలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులంతా కలిసి పవిత్ర ఉమ్రా యాత్ర చేపట్టడం విశేషంగా మారింది.మొత్తం 60 మంది యాత్రికులు మక్కా, మదీనా పుణ్యక్షేత్రాలను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు.ఈ సందర్భంగా అల్మిజాన్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఫయాజ్ అలీ మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ఉమ్రా యాత్రకు సంబంధించి వస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మి కొందరు యాత్రకు వెళ్లేందుకు వెనుకడుగు వేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉమ్రా యాత్రకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, ప్రయాణికులు అనవసరమైన అపోహలకు గురికావద్దని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రతి సమాచారాన్ని నిజమని నమ్మకుండా వాస్తవాలను తెలుసుకోవాలని కోరారు.15 రోజుల పాటు సాగిన పవిత్ర యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకుని క్షేమంగా స్వదేశానికి చేరుకోవడంతో యాత్రికులు సంతోషం వ్యక్తం చేశారు. విమానాశ్రయంలో కుటుంబ సభ్యులు, బంధువులు ఆత్మీయంగా స్వాగతం పలకడంతో అక్కడ పండుగ వాతావరణం నెలకొంది.

# హైదరాబాద్‌లో ఘనంగా హైదరాబాద్ వాక్స్-నషా ముక్త్ భారత్ పాదయాత్ర

## నాగోల్ డివిజన్ నుంచి భారీగా తరలివెళ్లిన బీజేపీ శ్రేణులు పాదయాత్రకు జెండా ఊపి ప్రారంభించిన బీజేపీ సీనియర్ నాయకులు చింతల సురేందర్ యాదవ్

**నాగోల్,(ప్రజావినికిడి):**



హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలోనిర్వహించనున్న హైదరాబాద్ వాక్స్-నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు నిర్వహించనున్న భారీ పాదయాత్రకు నాగోల్ డివిజన్ నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద ఎత్తున తరలివెళ్లారు.ఈ సందర్భంగా నాగోల్ డివిజన్ నుంచి బయలుదేరిన పాదయాత్రను బీజేపీ సీనియర్ నాయకులు చింతల సురేందర్ యాదవ్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యువత, మహిళలు,పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని నషా ముక్త్ భారత్ నినాదాలతో ముందుకు సాగారు.ఈ సందర్భంగా చింతల సురేందర్ యాదవ్ మాట్లాడుతూ, నేటి సమాజంలో మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తుకు తీవ్ర ముప్పుగా మారుతోందని, డ్రగ్స్ అలాగే ఇతర మత్తు పదార్థాల బారిన పడుతూ ఎంతోమంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.యువత దేశానికి వెన్నెముక అని, వారి శక్తి, సామర్థ్యాలు దేశ అభివృద్ధికి ఉపయోగపడాలని పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని,తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, యువతలో చైతన్యం తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు.

మత్తు పదార్థాల రహిత భారతదేశ నిర్మాణమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడటం,ప్రతి కుటుంబానికి భరోసా కల్పించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు.

ప్రతి ఒక్కరూ నషా ముక్త్ భారత్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని, ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన భారతదేశం సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు.

నాగోల్ డివిజన్ నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు అదేవిదంగా యువత పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముందుకు రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

నషా ముక్త్ భారత్- ఆరోగ్యవంతమైన యువత బలమైన భారతదేశం అనే సంకల్పంతో ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాగోల్ డివిజన్ నుండి చింతల సురేందర్ యాదవ్ తో పాటు నాగోల్ డివిజన్ బిజెపి పార్టీ అధ్యక్షులు ఫంగ శ్రీకాంత్ బిజెపి పార్టీ నాయకులు బద్దం బాలకృష్ణ గౌడ్,నూకల పద్మా రెడ్డి, సరస్వతి,గౌరీ, సంతోష్, శివముదిరాజ్ మనోజ్,శివ తదితరులు పాల్గొన్నారు

# శంషాబాద్ లో యువ కార్మికుడి మృతి

## బ్రుందావన్ టౌన్‌షిప్‌లో ఘటన..

## గదిలో విగతజీవిగా కనిపించిన 22 ఏళ్ల యువకుడు



**శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 25,** శంషాబాద్ ఆర్ జి ఐ పోలీస్‌స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. శంషాబాద్‌లోని బ్రుందావన్ టౌన్‌షిప్ కాలనీలో ఓ యువ కార్మికుడు గదిలో మృతి చెందిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన కుందన్ కుమార్ (22) గత రెండేళ్లుగా శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. బ్రుందావన్ టౌన్‌షిప్ కాలనీలోని ఓ ఇంట్లో నిఖిల్ కుమార్, హీరాలాల్‌తో కలిసి అద్దెకు ఉంటున్నాడు.ఈ నెల 24న ఉదయం 6 గంటలకు రాత్రి విధులు ముగించుకుని గదికి చేరుకున్న కుందన్ కుమార్ నిద్రపోయాడు. ఉదయం 9 గంటల సమయంలో అతడి రూమ్‌మేట్స్ నిఖిల్ కుమార్, హీరాలాల్ పనికి వెళ్లారు. రాత్రి 10.30 గంటలకు తిరిగి వచ్చేసరికి గది తలుపులు మూసి ఉండటంతో పలుమార్లు తట్టారు.లోపలి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో అతడు నిద్రపోతున్నాడని భావించి మరో స్నేహితుడి గదిలో రాత్రి గడిపారు. మరుసటి రోజు ఉదయం 6.30 గంటలకు తిరిగి వచ్చి తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో ఇంటి యజమాని పోచన్నగారి యాదయ్యకు సమాచారం అందించారు. స్థానికుల సహాయంతో తలుపులు తెరిచి చూడగా కుందన్ కుమార్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి రూమ్‌మేట్ నిఖిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆర్జీఐ ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యక్తిగత కారణాలు లేదా ప్రేమ వ్యవహారంలో విఫలమవడం వల్ల ఈ ఘటన జరిగి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే మృతికి గల అసలు కారణాలను నిర్ధారించేందుకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి, సంబంధిత వ్యక్తుల నుంచి వివరాలు సేకరిస్తున్నారు. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

# నందిగామలో అంగన్‌వాడీ కమ్ క్రెచ్ కేంద్రం ప్రారంభం

## చిన్నారుల సంరక్షణకు భరోసా,మహిళల ఉపాధికి చేయూత -పాల్గొన్న గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణ,అధికారి జి.శాంతి శ్రీ





**షాద్ నగర్,(ప్రజావినికిడి):** నియోజకవర్గంలోని మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, మొబైల్ క్రెచెస్ సంస్థ ఆధ్వర్యంలో,ఎస్బిఐ ఫౌండేషన్ సహకారంతో రంగారెడ్డి జిల్లా నందిగామ గ్రామంలో నూతన అంగన్‌వాడీ కమ్ క్రెచ్ కేంద్రాన్ని జిల్లా సంక్షేమ అధికారి జి.శాంతి శ్రీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ఎంపీడీవో అరుంధతి,జీవి సోషల్ కౌన్సిలర్ అనిత,సిడిపిఓ ఉదయ మేడం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.అదేవిధంగా షాద్‌నగర్ ప్రాజెక్ట్ సూపర్వైజర్లు విమల,సంధ్య,గీత, విజయలక్ష్మి,మొబైల్ క్రెచెస్ తెలంగాణ ప్రోగ్రామ్ ఆఫీసర్ కమ్ ట్రైనర్ మాణికప్ప,రంగారెడ్డి జిల్లా సూపర్వైజర్ పవిత్ర,క్రెచ్ టీచర్ సునీత,హెల్పర్ ప్రేమలత,అంగన్‌వాడీ టీచర్ సుజాత,హెల్పర్ అనిత, నందిగామ గ్రామ సర్పంచ్ కొమ్ము కృష్ణయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజ్ కుమార్,వార్డు సభ్యులు, కమ్యూనిటీ సభ్యులు,పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి

జి.శాంతి శ్రీ మాట్లాడుతూ,అంగన్‌వాడీ కమ్ క్రెచ్ కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ముఖ్యంగా పేద మరియు పని చేసే కుటుంబాలకు చెందిన తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కేంద్రాల్లో సురక్షితంగా ఉంచి ఉద్యోగ,ఉపాధి అవకాశాలను పొందవచ్చని తెలిపారు.

ఈ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన సంరక్షణ,పౌష్టికాహారం,ఆరోగ్య పరిరక్షణ, భద్రతతో పాటు వయస్సుకు తగిన అభ్యాసం,ఆటపాటల ద్వారా నేర్చుకునే అవకాశాలు మరియు సమగ్ర అభివృద్ధిని అందించడం ప్రధాన లక్ష్యమని వివరించారు. తల్లిదండ్రులు, ముఖ్యంగా మహిళలు పిల్లల సంరక్షణ గురించి ఆందోళన చెందకుండా స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ కేంద్రాలు ఎంతగానో తోడ్పడతాయని పేర్కొన్నారు.అదేవిధంగా నవంబర్ 25న జరుపుకునే అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవం సందర్భంగా మహిళల హక్కులు,గౌరవం,భద్రత అలాగే సమానత్వం గురించి అవగాహన కల్పించారు. మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,మహిళలకు సురక్షితమైన, గౌరవప్రదమైన వాతావరణాన్ని కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా అంగన్వాడి కంక్రచ్ సేవలు, చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం,భద్రత,బాలల సమగ్ర అభివృద్ధి అదేవిదంగా తల్లిదండ్రుల ఉపాధి అవకాశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అధికారుల, ప్రజాప్రతినిధుల, అంగన్‌వాడీ సిబ్బంది, కమ్యూనిటీ సభ్యులు అలాగే తల్లిదండ్రుల భాగస్వామ్యంతో కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.

# షాద్‌నగర్‌లో కోటి దీపోత్సవానికి సర్వం సిద్ధం..

## నేటి నుంచే కార్తీక కోటి దీపోత్సవ కార్యక్రమాలు ప్రారంభం..

## భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు..





**షాద్‌నగర్,(ప్రజావినికిడి):** పట్టణంలోని హాజిపల్లి రోడ్డులో గల ఆకుల మానయ్య గ్రౌండ్ లో నిర్వహించనున్న కార్తీక కోటి దీపోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు.దీపోత్సవంలో పాల్గొనే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు,అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు.కార్తీక మాసం సందర్భంగా నిర్వహించే ఈ కోటి దీపోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనే అవకాశం ఉండటంతో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. దీపారాధన,పూజా కార్యక్రమాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ఏర్పాట్లు చేపట్టారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్తీక దీపోత్సవంలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందాలని కోటి దీపోత్సవ నిర్వహణ సభ్యులు సింగారం నివాస్,శ్రీనివాస్,ప్యాట జయ శ్రీకాంత్,అశోక్ కుమార్,వంశీకృష్ణ,శ్రీనివాస్,దామోదర్,శ్రీధర్ గౌడ్,బర్మాలి జంగయ్య,రాజేష్ గౌడ్,తదితరులు వెల్లడించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# నిరుపేద విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ..

## హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం..

## సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ సహకారం




**శంషాబాద్, (ప్రజావినికిడి): నవంబర్ 25,** నిరుపేద విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం అందించడంతో పాటు పాఠశాలకు రాకపోకల్లో ఎదురవుతున్న ఇబ్బందులను దూరం చేయాలనే లక్ష్యంతో హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్, గుడేరా ఆధ్వర్యంలో నర్కుడ గ్రామంలో సైకిళ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నర్కుడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ సహకారంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో కవ్వగూడ, సుల్తాన్‌పల్లి, చౌదరర్ గూడ గ్రామాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు సైకిళ్లను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలకు చేరుకునేందుకు ఎదుర్కొంటున్న ప్రయాణ ఇబ్బందులను గుర్తించి,వారి చదువుకు ఆటంకాలు కలగకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. సైకిళ్ల పంపిణీ ద్వారా విద్యార్థులకు సమయం ఆదా కావడంతో పాటు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరయ్యేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయడంలో ఇలాంటి సహకారం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు సైకిళ్లను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలస్వామి, నాయకులు తొంట అశోక్, గూడెపు లక్ష్మణ్, ఉపాధ్యాయ బృందం,హెడ్ హెల్డ్ హై ఫౌండేషన్ కోఆర్డినేటర్లు సతీష్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.




# ఏపీ సొంత రాబడి పెరిగింది..

**ఆదాయార్జన శాఖలపై చంద్రబాబు కీలక సమీక్ష**

**రాష్ట్ర సొంత ఆదాయంలో 18.7 శాతం వృద్ధి నమోదు**

**ప్రజలపై భారం లేకుండా ఆదాయం పెంచాలన్న సీఎం చంద్రబాబు**

**నవంబర్ 23 నాటికే 58 శాతం వార్షిక లక్ష్యం పూర్తి**

**వాణిజ్య, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల్లో పెరిగిన రాబడి**

**పన్నుల పరిశీలన, ఆడిట్‌లలో ఏఐ సాంకేతికత వినియోగం**




**అమరావతి నవంబర్ 25(ప్రజావినికిడి):**

రాష్ట్రంలో ఆదాయార్జన శాఖల పనితీరు, రాబడి వృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం తీసుకుంటున్న కీలక నిర్ణయాలు, పరిపాలనా సంస్కరణలు, క్షేత్రస్థాయి అభివృద్ధి కార్యక్రమాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని ఈ సందర్భంగా వెల్లడైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు స్పెషల్ మార్జిన్‌తో కలిపి రాష్ట్ర సొంత ఆదాయం రూ.74,342 కోట్లకు చేరింది. గతేడాది ఇదే సమయానికి నమోదైన రూ.62,604 కోట్లతో పోలిస్తే ఇది రూ.11,738 కోట్లు అధికమని, మొత్తంగా 18.7 శాతం వృద్ధి నమోదైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఈ సమీక్షా సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ (సాయి ప్రసాద్)తో పాటు ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, స్టాంపులు-రిజిస్ట్రేషన్లు, గనులు, రవాణా, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర వార్షిక ఆదాయ లక్ష్యం రూ.1,27,506 కోట్లు కాగా, నవంబర్ 23 నాటికే అందులో 58 శాతం మేర సాధించినట్లు అధికారులు తెలిపారు. ఇందులో పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో 18.8 శాతం, పన్నేతర ఆదాయంలో 31.3 శాతం వృద్ధి నమోదైంది. పన్ను ఆదాయం గతేడాది రూ.53,692 కోట్లు ఉండగా, ఈ ఏడాది రూ.10,104 కోట్లు పెరిగి రూ.63,796 కోట్లకు చేరింది. అలాగే పన్నేతర ఆదాయం రూ.1,330 కోట్ల నుంచి రూ.2,091 కోట్లకు ఎగబాకింది.

**శాఖల వారీగా ఆదాయ వివరాలు:**

వాణిజ్య పన్నులు: 18.3 శాతం వృద్ధితో రూ.5,917 కోట్ల మేర అదనపు ఆదాయం నమోదైంది. ఇందులో జీఎస్టీ ద్వారా వచ్చిన రాబడి 18.1 శాతం పెరిగి రూ.3,694 కోట్లకు చేరింది.

ఎక్సైజ్ శాఖ: స్పెషల్ మార్జిన్‌తో కలిపి రూ.20,083 కోట్ల ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే 19.6 శాతం వృద్ధితో రూ.3,287 కోట్లు అదనంగా సమకూరింది.

స్టాంపులు, రిజిస్ట్రేషన్లు: 16.6 శాతం వృద్ధితో మొత్తం రూ.8,020 కోట్ల రాబడి వచ్చింది.

రవాణా శాఖ: వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్ల ద్వారా 17.3 శాతం వృద్ధి నమోదై రూ.3,649 కోట్ల పన్నుల ఆదాయం సమకూరింది.

గనులు, భూగర్భ శాఖ: 13.2 శాతం వృద్ధితో రూ.2,086 కోట్లకు చేరింది.

అటవీ శాఖ: 22.3 శాతం పెరిగి రూ.22 కోట్ల ఆదాయం లభించింది.

స్థానిక సంస్థలు: ఏప్రిల్ 1 నుంచి నవంబర్ 20 వరకు పంచాయతీల పన్ను ఆదాయం రూ.238 కోట్లుగా, పట్టణ స్థానిక సంస్థల్లో రూ.2,365 కోట్లుగా నమోదైంది.

**ప్రజలపై భారం మోపొద్దు: సీఎం చంద్రబాబు**

సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ప్రజలపై ఎలాంటి పన్నుల భారం మోపకుండా, కొత్తగా ఛార్జీలు పెంచకుండానే ప్రభుత్వ శాఖల్లో రాబడిని మరింత పెంచేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ వ్యవస్థల్లో లీకేజీలను అరికట్టడం, లోపాలను సరిదిద్దడం, ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకతను పెంచడం వల్లే ఆదాయంలో గణనీయమైన పురోగతి కనిపించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం స్పష్టంగా ప్రతిబింబించేలా ఆదాయ వృద్ధి కొనసాగాలని అధికారులను ఆదేశించారు.

పన్ను వసూళ్ల వ్యవస్థను ఆధునీకరించే క్రమంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను విస్తృతంగా వినియోగిస్తున్నట్లు సీఎం తెలిపారు. ప్రస్తుతం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తిపన్ను వసూళ్లకు ఏఐ వ్యవస్థను అమలు చేస్తున్నామని చెప్పారు. అంతేకాకుండా, వాణిజ్య పన్నుల శాఖలోని నాలుగు విభాగాల్లో ఈ ఏడాది ఏప్రిల్ నుంచే ఏఐ స్టాక్ వినియోగిస్తున్నామని.. పన్ను రిటర్నుల పరిశీలన, ఆడిట్, క్షేత్రస్థాయి తనిఖీలు, న్యాయపరమైన వ్యవహారాల పరిష్కారంలో సాంకేతికతను సమర్థవంతంగా వాడుకుంటున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

# ఆ ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర లేదు..

**భూమన వ్యాఖ్యలు నిరాధారం: మంత్రి ఆనం**

**రేణిగుంట ఆంజనేయ స్వామి ఆలయం రికార్డుల ప్రకారం 70 ఏళ్ల క్రితం నిర్మించిందని వెల్లడి**

**ఎన్‌హెచ్716 విస్తరణలో భాగంగా 2023 అక్టోబర్‌లోనే భూసేకరణ తుది ఉత్తర్వులు ఖరారు**

**సేకరించిన స్థలానికి పరిహారంగా రూ.59.30 లక్షలు ఆలయ ఈవో ఖాతాలో జమ**

**హిందూ ధర్మం మరియు భక్తుల మనోభావాల పట్ల ప్రభుత్వానికి పూర్తి గౌరవం ఉందని స్పష్టీకరణ**




**అమరావతి నవంబర్ 25 (ప్రజావినికిడి):**

రేణిగుంటలోని ఆంజనేయస్వామి ఆలయ అంశంపై టీటీడీ మాజీ చైర్మన్ భూమనా కరుణాకర్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. రాజకీయ లబ్ధి కోసమే లేని వివాదాన్ని సృష్టించి హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా వేదికగా స్పందించారు.

ఆలయ చరిత్రకు సంబంధించి దేవాదాయ శాఖ, రెవెన్యూ, స్థానిక పంచాయతీ రికార్డులను పరిశీలిస్తే ఈ ఆలయం సుమారు 70 ఏళ్ల క్రితం నిర్మితమైందని మంత్రి స్పష్టం చేశారు. కొందరు ప్రచారం చేస్తున్నట్లుగా దీనికి వెయ్యేళ్ల చరిత్ర లేదని ఆయన వెల్లడించారు. కనీస వాస్తవాలను తెలుసుకోకుండా, గతంలో ఆలయ పునరుద్ధరణ లేదా దాని స్థితిగతులను పట్టించుకోని వ్యక్తులు ఇప్పుడు ప్రభుత్వంపై బురదజల్లడమే లక్ష్యంగా ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.

నేషనల్ హైవే716 విస్తరణ పనుల్లో భాగంగా ఈ ఆలయానికి సంబంధించిన భూమి సేకరణ ప్రక్రియ 2023 అక్టోబర్‌లోనే పూర్తయి, అవార్డు కూడా ఖరారైందని ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. సేకరించిన సుమారు 10 సెంట్ల భూమికి సంబంధించి రూ.59,30,606 పరిహారాన్ని జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), ప్రభుత్వ ఆమోదంతో ఆగస్టు 1వ తేదీనే ఆలయ ఈవో ఖాతాలో జమ చేసినట్లు వివరించారు.

ప్రస్తుతం ఈ ఆలయం తిరుపతి గ్రూప్ టెంపుల్స్ ఈవో పర్యవేక్షణలో ఉందని, అన్ని వ్యవహారాలు నిబంధనల ప్రకారమే పారదర్శకంగా జరుగుతున్నాయని మంత్రి స్పష్టం చేశారు. వాస్తవాలను తొక్కిపెట్టి, ప్రజల్లో గందరగోళం సృష్టించి ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూడటం అవివేకమని ఆయన విమర్శించారు. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు భక్తుల నమ్మకాలు, విశ్వాసాలను గౌరవించడంలో తమ ప్రభుత్వానికి పూర్తి నిబద్ధత ఉందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తేల్చిచెప్పారు.




# ఏపీ స్థానిక పోరుకు పటిష్ఠ భద్రత..

**రంగంలోకి దిగిన 46 వేల మంది పోలీసులు.. డ్రోన్లు, బాడీ కెమెరాలతో నిఘా**

**తొలి విడత పంచాయతీ, పురపాలక ఎన్నికలకు పోలీసుల భారీ బందోబస్తు**

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రత**

**నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు విస్తృత తనిఖీలు**




**అమరావతి నవంబర్ 25 (జర్నలిస్ట్ వార్త):**

ఏపీలో తొలి విడత గ్రామ పంచాయతీ, 23 పట్టణ స్థానిక సంస్థల (పురపాలక సంఘాల) ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. రేపు జరగనున్న పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఈ ఎన్నికల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 46,000 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు.తొలి విడతలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 3,191 సర్పంచ్, 25,061 వార్డు స్థానాలకు, 23 పురపాలక సంఘాలకు పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల బందోబస్తు కోసం మొత్తం 46,350 మంది సిబ్బందిని కేటాయించినట్లు ఎన్నికల పోలీస్ సమన్వయకర్త, ఐజీ బి. రాజకుమారి తెలిపారు. వీరిలో 16,701 మందిని పురపాలక ఎన్నికల విధులకు, మిగిలిన 29,649 మందిని గ్రామ పంచాయతీ ఎన్నికల భద్రతకు కేటాయించినట్లు ఆమె వివరించారు. జిల్లా పోలీసు బలగాలతో పాటు, 127 ప్లాటూన్ల ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ (ఏపీఎస్పీ) బలగాలను కూడా మోహరించారు. వీరితో పాటు రైల్వే, ఈగిల్, ఇతర విభాగాల సిబ్బంది కూడా బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు.ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశామని డీజీపీ తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వారిపై ముందుగానే బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం పంపిణీని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరం చేసినట్లు చెప్పారు. ఈసారి ఎన్నికల పర్యవేక్షణకు డ్రోన్లు, సీసీటీవీ కెమెరాలు, బాడీ-వోర్న్ కెమెరాలు, 'ట్రేస్' యాప్ వంటి ఆధునిక టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. పోలీస్ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను పోలీస్ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించనున్నారు.

# గల్లంతైన కాకినాడ మత్స్యకారులు క్షేమం

**: మంత్రి అచ్చెన్నాయుడు**

**ఇంజన్ ఫెయిలై సముద్రంలో చిక్కుకుపోయిన బోటు**

**కృష్ణాపురం సమీపంలో వారి ఆచూకీ గుర్తించిన కోస్ట్ గార్డ్**

**మత్స్యకారులను తీరానికి చేర్చే పనులు ముమ్మరం**

**సహాయక చర్యలపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటన**

**అమరావతి నవంబర్ 25 (ప్రజావినికిడి):**

కాకినాడ జిల్లా నుంచి వేటకు వెళ్లి గల్లంతైన ఏడుగురు మత్స్యకారులు సురక్షితంగా ఉన్నారని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. వారి బోటు ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో సముద్రంలో చిక్కుకుపోయారని, అయితే ప్రస్తుతం వారంతా క్షేమంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం సుబ్బంపేట గ్రామానికి చెందిన ఏడుగురు మత్స్యకారులు వేటకు వెళ్లగా, నవంబర్ 19 నుంచి కుటుంబ సభ్యులతో వారి కమ్యూనికేషన్ సంబంధాలు తెగిపోయాయి. ఉప్పాడ, తుని మధ్యలో ఉన్న కృష్ణాపురం తీరానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలో వారి బోటు నిలిచిపోయినట్లు అధికారులు గుర్తించారు.సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన ఇండియన్ కోస్ట్ గార్డ్, ఇండియన్ నేవీ హెలికాప్టర్లు, నౌకలతో పారాదీప్ తీర ప్రాంతంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. మత్స్యకారుల ఆచూకీ కనుగొనడంలో సకాలంలో స్పందించి సహాయం అందించిన కోస్ట్ గార్డ్, నేవీ సిబ్బందికి మంత్రి అచ్చెన్నాయుడు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రస్తుతం మత్స్యకారులను, వారి బోటును సురక్షితంగా తీరానికి చేర్చేందుకు మరో బోటు సహాయంతో ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి వివరించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, మత్స్యకారుల కుటుంబాలు ఆందోళన చెందవద్దని ఆయన భరోసా ఇచ్చారు.

ప్రజావినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# వృద్ధాప్యానికి ఏఐతో చెక్..

## మనిషి 1400 ఏళ్లు బతకడం సాధ్యమేనా?

**మనిషి 1400 ఏళ్లు జీవించగలడని ఆక్స్‌ఫర్డ్ మాజీ ప్రొఫెసర్ నిక్ బోస్ట్రోమ్ వాదన**

**సూపర్ ఏఐతో వృద్ధాప్య ప్రక్రియను ఆపవచ్చని అంచనా**

**ఏఐ అభివృద్ధిని ఆపితే ప్రాణనష్టమేనంటూ బోస్ట్రోమ్ కొత్త వాదన**

**ప్రస్తుతం ప్రపంచ సగటు ఆయుష్షు 73 ఏళ్లు మాత్రమేనన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ**

**న్యూ ఢిల్లీ నవంబర్ 25 (ప్రజావినికిడి):**

మనిషి 1,400 సంవత్సరాల వరకు జీవించగలడని, ఇది అసాధ్యమేమీ కాదని స్వీడన్‌కు చెందిన తత్వవేత్త, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ నిక్ బోస్ట్రోమ్ సంచలన వాదన వినిపిస్తున్నారు. అత్యంత శక్తిమంతమైన కృత్రిమ మేధ సాయంతో జీవ సంబంధమైన వృద్ధాప్య ప్రక్రియను ఆపగలిగితే ఇది సాధ్యమవుతుందని ఆయన తన తాజా పరిశోధన పత్రంలో పేర్కొన్నారు.బోస్ట్రోమ్ తన 'ఆప్టిమల్ టైమింగ్ ఫర్ సూపర్ ఇంటెలిజెన్స్' అనే పరిశోధన పత్రంలో ఈ విషయాన్ని గణితశాస్త్ర పరంగా వివరించారు. ఆయన ప్రకారం, శాస్త్రవేత్తలు వృద్ధాప్య ప్రక్రియను పూర్తిగా తొలగించగలిగితే, వయసు పెరగడం వల్ల వచ్చే మరణ ప్రమాదం గణనీయంగా తగ్గిపోతుంది. బోస్ట్రోమ్ అభివృద్ధి చెందిన దేశాల్లోని 20-25 ఏళ్ల ఆరోగ్యవంతుల వార్షిక మరణాల రేటును ప్రాతిపదికగా తీసుకున్నారు. ఆయన అంచనా ప్రకారం ఇది సుమారు 0.05-0.08 శాతం ఉంటుంది. ఆయన ఉదాహరణ కోసం 0.07 శాతం అనే సంఖ్యను తీసుకున్నారు. ఒక వ్యక్తి జీవితకాలం అంతటా ఈ మరణ ప్రమాదం స్థిరంగా ఉంటే, అప్పుడు ఆ వ్యక్తి యొక్క అంచనా ఆయుష్షు సుమారు



1,400 ఏళ్లుగా ఉంటుంది. అయితే, ఇది ప్రమాదాలు, హింస వంటి ఇతర మరణ కారణాలను మినహాయించి చేసిన అంచనా మాత్రమే.

### ఏఐ పాత్ర ఏమిటి?

సూపర్ ఇంటెలిజెంట్ ఏఐ.. శాస్త్ర, వైద్య రంగాల్లో, ముఖ్యంగా వృద్ధాప్య నిరోధక పరిశోధనలలో విప్లవాత్మక పురోగతిని సాధించగలదని బోస్ట్రోమ్ బలంగా నమ్ముతున్నారు. అల్జీమర్స్ వంటి నయం కాని వ్యాధులకు చికిత్స కనుగొనడం, వయసు పెరగడం వల్ల దెబ్బతిన్న కణాలను, కణజాలాలను పునరుద్ధరించడం, దెబ్బతిన్న అవయవాలను బాగుచేయడం వంటివి ఏఐతో సాధ్యపడతాయని ఆయన అంచనా వేశారు. ఉదాహరణకు, అల్జీమర్స్ రోగి మెదడులో కోల్పోయిన న్యూరాన్‌లను తిరిగి పెంచడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

### ఏఐ అభివృద్ధిపై వివాదం.. కొత్త కోణం

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చాలా మంది శాస్త్రవేత్తలు, ఏఐ నిపుణులు శక్తిమంతమైన ఏఐ వ్యవస్థల అభివృద్ధిని నెమ్మదింపజేయాలని వాదిస్తున్నారు. మానవ ప్రయోజనాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే పెను విపత్తు తప్పదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే బోస్ట్రోమ్ ఈ వాదనలో మరో కోణాన్ని లేవనెత్తుతున్నారు. ఏఐ అభివృద్ధి ఆలస్యం అయ్యేకొద్దీ.. ప్రతి ఏటా, వైద్య పురోగతి లేక లక్షలాది మంది ప్రజలు చనిపోతుంటారని ఆయన పేర్కొన్నారు. సూపర్ ఇంటెలిజెన్స్ అభివృద్ధి అనేది ఒక ప్రాణాంతక వ్యాధికి చేసే ప్రమాదకరమైన సర్జరీ లాంటిదని, సర్జరీని సురక్షితం చేసేందుకు వేచి చూస్తే, రోగి వ్యాధితోనే చనిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

### ప్రస్తుత వాస్తవ పరిస్థితి

బోస్ట్రోమ్ వాదన ఎంత ఆశాజనకంగా ఉన్నా, ప్రస్తుత వాస్తవానికి, ఆయన ఊహకు మధ్య చాలా వ్యత్యాసం ఉంది. వృద్ధాప్యాన్ని ఆపే చికిత్స ఏదీ ఇంకా నిరూపించబడలేదు. సెల్యులార్ రీప్రోగ్రామింగ్, సెనోలిటిక్స్ వంటి అంశాలపై పరిశోధనలు ప్రాథమిక దశలోనే ఉన్నాయి. ఏఐ ఔషధాల ఆవిష్కరణలో ఉపయోగపడుతున్నప్పటికీ, దాని క్లినికల్ ప్రభావం ఇంకా పరిమితంగానే ఉందని ప్రముఖ సైన్స్ జర్నల్స్ పేర్కొంటున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకారం.. 2023 నాటికి ప్రపంచ సగటు ఆయుష్షు 73.3 సంవత్సరాలు కాగా, ఆరోగ్యకరమైన జీవితకాలం కేవలం 62.8 ఏళ్లు మాత్రమే. అంటే.. ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నా, ఆ అదనపు సంవత్సరాలను ఆరోగ్యంగా గడపలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో 1400 ఏళ్ల జీవితం అనే ఆలోచన ప్రస్తుతానికి ఒక ఆసక్తికరమైన ప్రతిపాదనగానే మిగిలిపోతోంది.

# బంగారంపై అప్పులకు ఎగబడ్డ జనం..

## రెండేళ్లలోనే రెట్టింపైన గోల్డ్ లోన్ మార్కెట్!

**న్యూ ఢిల్లీ నవంబర్ 25 (ప్రజావినికిడి):**




భారతదేశంలో బంగారం రుణాల (గోల్డ్ లోన్) మార్కెట్ సరికొత్త గరిష్ఠాలను తాకుతూ దూసుకెళుతోంది. 2026 సెప్టెంబర్ నాటికి దేశవ్యాప్తంగా గోల్డ్ లోన్ పోర్ట్‌ఫోలియో ఏకంగా 60.6 శాతం పెరిగి రూ.23.3 లక్షల కోట్లకు చేరింది. 'క్రిఫ్' క్రెడిట్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ తాజా నివేదిక ఈ ఆసక్తికర వివరాలను వెల్లడించింది.దేశంలోని మొత్తం రూ.185.2 లక్షల కోట్ల రిటైల్ లోన్ మార్కెట్‌లో ఒక్క గోల్డ్ లోన్ల వాటాయే 12.6 శాతానికి చేరుకుంది. రుణాల సంఖ్యతో పోలిస్తే మొత్తం రుణ విలువలో భారీ పెరుగుదల నమోదైంది. దీన్ని బట్టి చూస్తే ప్రజలు ఒక్కో అకౌంట్‌పై తీసుకునే సగటు రుణ మొత్తం (టికెట్ సైజ్) గణనీయంగా పెరిగినట్లు స్పష్టమవుతోంది. 2024 సెప్టెంబర్‌లో రూ.10.7 లక్షల కోట్లుగా ఉన్న ఈ పోర్ట్‌ఫోలియో, కేవలం రెండేళ్ల వ్యవధిలోనే రెట్టింపు కంటే ఎక్కువగా రూ.23.3 లక్షల కోట్లకు పెరిగింది. ఇదే సమయంలో యాక్టివ్ రుణాల సంఖ్య 8.1 కోట్ల నుంచి 10.2 కోట్లకు ఎగబాకింది.ప్రాధాన్యతా రంగానికి ఇచ్చిన బంగారు రుణాలు రూ.8.2 లక్షల కోట్లతో మొత్తం మార్కెట్‌లో 35.1 శాతం వాటాను దక్కించుకున్నాయి. రుణగ్రహీతల సంఖ్యను పరిశీలిస్తే, మహిళలు, చిన్న పట్టణాల ప్రజలే ముందువరుసలో ఉన్నారు. గోల్డ్ లోన్ తీసుకుంటున్న మహిళల సంఖ్య ఏటా 16 శాతం వృద్ధితో 2.4 కోట్లకు చేరింది. టైర్-3 సహా చిన్న నగరాల నుంచి రుణాలు తీసుకునేవారి సంఖ్య 16.1 శాతం వృద్ధితో 3.7 కోట్లకు విస్తరించింది. మరోవైపు హైరిస్క్ కేటగిరీ కిందకు వచ్చే రుణగ్రహీతల వాటా 14.8 శాతం నుంచి 16.7 శాతానికి పెరిగినట్లు నివేదిక వెల్లడించింది.

# వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి బెయిల్ నిరాకరణ

**ఎన్నికల అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై నమోదైన కేసు**

**దర్యాప్తు అత్యంత కీలక దశలో ఉన్నందున బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసిన న్యాయస్థానం**

**సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదం ఉందని తెలిపిన న్యాయమూర్తి**

**అమరావతి నవంబర్ 25 (ప్రజావినికిడి):**



వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డికి గుంటూరు కోర్టులో నిరాశ ఎదురైంది. ఎన్నికల అధికారుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై నమోదైన కేసులో ఆయన దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్‌ను గుంటూరు రెండో అదనపు జిల్లా జడ్జి కోర్టు కొట్టివేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, ప్రస్తుత పరిస్థితుల్లో నిందితుడికి బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేశారు.ఈ కేసులో నమోదైన అభియోగాల తీవ్రత ఎక్కువగా ఉందని, పైగా దర్యాప్తు ప్రస్తుతం అత్యంత కీలక దశలో కొనసాగుతోందని కోర్టు పేర్కొంది. ఈ దశలో నిందితుడికి బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఆటంకం కలగడంతో పాటు సాక్షులను ప్రభావితం చేసే అవకాశముందని న్యాయస్థానం అభిప్రాయపడింది. గుంటూరు జిల్లా వెంగళాయపాలెంలో పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలిస్తుండగా ఎన్నికల అధికారులను అడ్డుకున్నారని నల్లపాడు పోలీసులు అప్పిరెడ్డిపై కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో నవంబర్ 6న ఆయన్ను అరెస్ట్ చేయగా, కోర్టు రిమాండ్ విధించింది.తాజాగా కోర్టు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చడంతో లేళ్ల అప్పిరెడ్డి రాజమండ్రి సెంట్రల్ జైలులోనే రిమాండ్ ఖైదీగా కొనసాగనున్నారు.

# భారత్‌పై మరోసారి వాణిజ్య కొరడా..

## సరికొత్త సుంకాలకు అమెరికా రెడీ!

**న్యూ ఢిల్లీ నవంబర్ 25 (ప్రజావినికిడి):**



భారత ఎగుమతులపై కొత్తగా భారీ సుంకాలు (టారిఫ్‌లు) విధించేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కారు సిద్ధమవుతోంది. పరిశ్రమలకు సబ్సిడీలు ఇస్తూ అమెరికా సంస్థలను దెబ్బతీస్తున్నారనే ఆరోపణలతో భారత్ సహా పలు దేశాలపై పన్నుల బాదుడుకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు వాల్‌స్ట్రీట్ జర్నల్ కీలక కథనాన్ని ప్రచురించింది.

చైనా, భారత్, జపాన్, దక్షిణ కొరియా, ఐరోపా సమాఖ్య (ఈయూ) వంటి ప్రధాన దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ కొత్త సుంకాలను ప్రతిపాదించారు. విదేశీ ప్రభుత్వాలు ఇచ్చే పారిశ్రామిక రాయితీలపై అమెరికా వాణిజ్య ప్రతినిధి (యూఎస్‌టీఆర్) జేమీసన్ గ్రీర్ గత కొన్ని నెలలుగా జరిపిన విచారణ నివేదిక త్వరలోనే విడుదల కానుంది. రాయితీలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల కారణంగా ఆయా దేశాల్లో మితిమీరిన ఉత్పత్తి జరుగుతోందని, తక్కువ ధరకు వస్తువులను సరఫరా చేస్తూ అమెరికా సంస్థల మనుగడను దెబ్బతీస్తున్నారని గ్రీర్ పేర్కొన్నారు.

1974 నాటి వాణిజ్య చట్టంలోని 'సెక్షన్ 301' కింద మార్చి 11న యూఎస్‌టీఆర్ ఈ విచారణ చేపట్టింది. తాజా నిర్ణయంతో అమెరికాకు ఎగుమతయ్యే అత్యధిక ఉత్పత్తులపై సుంకాల భారం పడనుంది. అయితే ఉక్కు, అల్యూమినియం, వాహన రంగాలు ఇప్పటికే ప్రత్యేక జాతీయ భద్రతా నిబంధనల కింద పన్నుల పరిధిలో ఉండటంతో, వాటిని దీని నుంచి మినహాయించే అవకాశముంది.

తుది పన్ను శాతాలపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. అయితే 2025 నాటి సుంకాలను మళ్లీ అమలు చేయాలని ట్రంప్ బృందం యోచిస్తోంది. జులైలో విదేశీ సరఫరా గొలుసులపై విధించిన 10 నుంచి 12.5 శాతం సుంకాలకు ఇవి అదనంగా చేరనున్నాయి.

మరోవైపు భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై చర్చలు నడుస్తున్నాయి. బంగ్లాదేశ్, వియత్నాం, కాంబోడియా వంటి పోటీ దేశాల కంటే తమ వస్తువులపై తక్కువ సుంకాలు ఉండాలని భారత్ కోరుతోంది. ఇలాంటి సమయంలో అమెరికా తాజా చర్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# చివరకు.. పవన్ మాటే 'గెలిచింది'!



**అమరావతి నవంబర్ 25 (ప్రజావినికిడి):**

నెల్లూరు జిల్లా ఆత్మకూరు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ పదవి ఎంపిక విషయంలో కూటమి నేతల మధ్య తలెత్తిన విభేదాలు తీవ్రస్థాయికి చేరిన నేపథ్యంలో చివరకు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాటే గెలిచింది. ఈ వివాదంలో టీడీపీ నేత మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జోక్యం చేసుకోవడంపై సీఎం చంద్రబాబు సైతం అసహనం వ్యక్తం చేయడం గమనార్హం. ఇక, ఈ వ్యవహారంలో సోమవారం జరగాల్సిన ఎన్నికల ప్రక్రియ మంగళవారం పూర్తయింది.కూటమి ఒప్పందం ప్రకారం ఆత్మకూరు మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ పదవిని జనసేన పార్టీకి కేటాయించారు. దీంతో పవన్ కల్యాణ్.. 11వ వార్డు కౌన్సిలర్ గా విజయం దక్కించుకున్న కొలగాని శిరీష పేరును ఆ పదవికి ప్రతిపాదించారు. అనంతరం.. బీ-ఫామ్ కూడా ఆమెకే అందించారు. దీంతో అంతా ప్రశాంతంగా జరిగిపోతుందని అందరూ భావించారు. అయితే.. సోమవారం నాటి ప్రమాణ స్వీకార కార్యక్రమం సమయంలో శిరీషకు బదులుగా మరో జనసేన కౌన్సిలర్ కత్తి పద్మజ పేరు తెరమీదికి వచ్చింది. ఇదే వివాదానికి కారణమైంది.జనసేన వ్యవహారంలో మంత్రి ఆనం జోక్యం చేసుకోవడం.. జనసేన నిర్ణయించిన అభ్యర్థి శిరీషను కాదని.. స్వయంగా పద్మజ పేరును ఆనం రామనారాయణరెడ్డి ప్రతిపాదించడం దుమారానికి దారితీసింది. అధిష్టానం ప్రకటించిన అభ్యర్థిని కాదని, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి జోక్యంతో ఏకపక్షంగా కత్తి పద్మజ పేరును ఖరారు చేశారని ఆరోపిస్తూ జనసేన ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ నలిశెట్టి శ్రీధర్, ఇతర పార్టీ కార్యకర్తలు మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మరోవైపు, తన ప్రమేయం ఏమీ లేదని మంత్రి ఆనం స్పందించినట్లు వార్తలు వచ్చినా.. టీడీపీ అధిష్టానం ఈ విషయాన్ని ఖరారు చేసుకుంది. దీంతో ఆనంను జోక్యం చేసుకోవద్దని పార్టీ పెద్దలు తేల్చిచెప్పారు. మరోవైపు.. పవన్ కళ్యాణ్ సూచించిన అభ్యర్థిని మార్చడంపై జనసేన అధిష్టానం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో సోమవారం జరిగిన ఎన్నిక ప్రక్రియను అధికారులు రద్దు చేసి, మరుసటి రోజు (మంగళవారం) ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పవన్ కల్యాణ్ ముందే నిర్ణయించి, బీఫాం కూడా ఇచ్చిన శిరీషను సభ్యులు ఎన్నుకొన్నారు. దీంతో ఆమె వైస్ చైర్మన్ గా పగ్గాలు చేపట్టారు. ఈ పరిణామాలపై టీడీపీ అంతర్గత విచారణకు ఆదేశించింది. జనసేనకు కేటాయించిన సీటులో టీడీపీ నేతలు జోక్యం చేసుకోవడం, మంత్రి స్వయంగా జనసేన అభ్యర్థులను తన కారులో ఎక్కించుకుని తీసుకువెళ్లడంపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది.

# ఏపీ కాంగ్రెస్ పై రాహుల్ నజర్

**న్యూ ఢిల్లీ నవంబర్ 25 (ప్రజావినికిడి):**



ఏపీలో కాంగ్రెస్ పార్టీ ఉందా అన్నది ఒక చర్చ అయితే ఆ పార్టీ పోరాటం ఎవరి మీద చేస్తోంది మరో చర్చ. అసలు ఈ పోరాటాలు అన్నీ ఆరాటాలేనా సొంత అజెండా వ్యక్తిగత లక్ష్యాలు కక్షలేనా అన్నది మరో కీలక ప్రశ్న. ఇవన్నీ కూడా ఏపీ కాంగ్రెస్ లో ఇంకా మిగిలి ఉన్న నిబద్ధత కలిగిన సీనియర్ నేతల నుంచి వస్తున్న సందేహాలు. అలాగే అసలు పార్టీలో ఏమి జరుగుతోంది అన్నది కూడా ఆందోళన కలిగించే వ్యవహారంగా చెబుతున్నారు. ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్న వైఎస్ షర్మిల వైసీపీ అధినేతగా ఉన్న వైఎస్ జగన్ ల మధ్య జరుగుతున్న వ్యక్తిగత వ్యవహారాలు ఆస్తులకు సంబంధించిన వివాదాలు ఇవన్నీ కాంగ్రెస్ పార్టీకి అవసరమా అన్నది కూడా మరో చర్చ. ఏపీలో చూస్తే కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దగా ఉనికి చూపించింది ఏమీ లేదని విమర్శ ఉంది. గుడ్డిలో మెల్లగా : ఇక ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీరాలలో మాత్రం కాంగ్రెస్ కాస్తో కనిపించింది అంటే అది మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణ మోహన్ క్రెడిట్ లోకే వెళ్తుందని అంటారు. ఆయన తన సొంత బలంతోనే కాంగ్రెస్ ని అక్కడా కాస్తో గొప్పో నిలబెట్టగలిగారు. అది తప్పించి మొత్తం ఏపీ వ్యాప్తంగా కాంగ్రెస్ పోటీ చేసినా సోదిలోకి లేకుండా పోయింది అని అంటున్నారు. పీసీసీ చీఫ్ హోదాలో షర్మిల కాంగ్రెస్ ని పట్టించుకోలేదని కూడా విమర్శలు ఉన్నాయి. ఇవన్నీ కూడా అసలైన కాంగ్రెస్ పార్టీ అభిమానులకు ఆవేదన కలిగిస్తున్నాయని అంటున్నారు. ఇక కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి డీకే శివ కుమార్ ఉన్నారు. ఆ రాష్ట్రంలో షర్మిల పీసీసీ చీఫ్ గా ఉంటూ యలహంక ప్యాలెస్ లోకి వెళ్లాలని ప్రయత్నాలను అక్కడి పోలీసులు అడ్డుకోవడం కూడా చర్చనీయాంశం అవుతోంది. తమ సొంత పార్టీకి చెందిన పీసీసీ చీఫ్ అయినా కోర్టు ఆదేశాలను అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడానికే మొగ్గు చూపిందని కూడా గుర్తు చేస్తున్నారు. ఇక బెంగళూరు యలహంక ప్యాలెస్ చుట్టూ సాగుతున్న వివాదం ఇవన్నీ కూడా అక్కడి ప్రభుత్వానికి తెలియనివి కావని అంటున్నారు. ఆ విధంగా కాంగ్రెస్ పెద్దలకు ఫీడ్ బ్యాక్ వెళ్లే ఉంటుందని కూడా చెబుతున్నారు. ఇక కాంగ్రెస్ నాయకురాలిగా ఉన్న షర్మిలకు టీడీపీ మద్దతుగా నిలవడం మీద కూడా చర్చ సాగుతోంది. చంద్రబాబుకు పెళ్ళి కార్డు షర్మిల అందించారు అన్న దాని మీద వైసీపీ సొంత మీడియా కధనాలు రాసింది. దాని మీద తప్పేముంది అని మాట్లాడటం వరకూ టీడీపీ పెద్దలు ఓకే కానీ అంతకు మించి అన్నట్లుగా షర్మిలకు మద్దతుగా నిలవడం టీడీపీ సొంత మీడియా కూడా ఆమె వైపు ఉండడం ఇవన్నీ చూసిన వారికి కేంద్రంలో ఎన్డీయే మీద కాంగ్రెస్ పోరాడుతూంటే ఏపీలో ఎన్డీయే మీద కాంగ్రెస్ ఏ మేరకు పోరాటం చేస్తోంది అన్నది కూడా చర్చిస్తున్నారు. దేశమంతా కాంగ్రెస్ గాలులు వీస్తున్నాయని దానిని అందిపుచ్చుకోవాలని జాతీయ స్థాయిలో ఆ పార్టీ పెద్దలు ప్రవచిస్తున్నారు మరి ఏపీలో కాంగ్రెస్ గాలి లేదా లేక వచ్చినా పట్టించుకోవడం లేదా లేక కాంగ్రెస్ నే ఏకంగా గాలికి వదిలేశారా అన్నది కూడా చర్చ సాగుతోంది. మరి ఏపీ మీద కాంగ్రెస్ ఫోకస్ పెడుతుందని కూడా మరోసారి చర్చ సాగుతోంది. అది భారీ మార్పులకు దారి తీస్తుందా లేక ఇంకా ఏమైనా జరుగుతుందా అనంది అయితే తెలియరావడం లేదు కానీ ఏపీ వైపు రాహుల్ గాంధీ చూపు ఉందని అంటున్నారు. ఈ ప్రచారంలో నిజమెంత అన్నది చూడాల్సి ఉంది

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఐసీసీ నంబర్ వన్ ర్యాంక్‌పై బుమ్రా గురి!

**● టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకిన భారత పేసర్.. అగ్రస్థానానికి చేరువలో**



న్యూఢిల్లీ: భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ టెస్టు బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో మరోసారి అగ్రస్థానాన్ని అందుకునేందుకు చేరువయ్యాడు. తాజాగా విడుదల చేసిన ఐసీసీ ర్యాంకింగ్స్‌లో బుమ్రా మూడు స్థానాలు మెరుగుపరుచుకుని ఉమ్మడి రెండో స్థానానికి చేరుకున్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు పడగొట్టడం అతడికి కలిసొచ్చింది.ప్రస్తుతం ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ 881 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో కొనసాగుతుండగా, బుమ్రా 856 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. ఇంగ్లాండ్ బౌలర్ ఓలీ రాబిన్సన్ కూడా అదే పాయింట్లతో ఉమ్మడి రెండో స్థానాన్ని పంచుకుంటున్నాడు. స్టార్క్‌కు బుమ్రాకు మధ్య కేవలం 25 పాయింట్ల తేడా మాత్రమే ఉండటంతో తదుపరి మ్యాచ్‌ల్లో బుమ్రా ప్రదర్శన కీలకం కానుంది.మరోవైపు టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లోనూ భారత ఆటగాళ్లు సత్తా చాటారు. రిషబ్ పంత్ ఒక స్థానం మెరుగుపరుచుకుని ఆరో ర్యాంక్‌కు చేరుకోగా, శుభ్‌మన్ గిల్ మూడు స్థానాలు ఎగబాకి ఏడో స్థానాన్ని దక్కించుకున్నాడు. యశస్వి జైస్వాల్ ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని తొమ్మిదో ర్యాంక్‌లో నిలిచాడు. దీంతో టెస్టు బ్యాటింగ్ టాప్-10లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు సంపాదించారు.

# యువరాజ్ అరగంట ఫోన్ కాల్.. వైభవ్ సూర్యవంశీ విధ్వంసానికి బాటలు!

**సలహాలు పాటించి సరికొత్త చరిత్ర సృష్టించిన 15 ఏళ్ల సంచలనం.. 53 బంతుల్లో 204 పరుగులతో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరిచిన యువ ఆటగాడు**



దోహా: భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్ సత్తా చాటాడు. యూఏఈతో జరిగిన ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు చేసి ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించాడు. మైదానంలోకి దిగినప్పటి నుంచి ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడుతూ సిక్సర్లు, ఫోర్లతో పరుగుల వరద పారించాడు. అయితే ఈ అద్భుత ఇన్నింగ్స్ వెనుక భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ ఇచ్చిన విలువైన సలహాలు కీలక పాత్ర పోషించాయి. మ్యాచ్‌కు ముందు యువరాజ్‌తో సుమారు 30 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడిన వైభవ్.. ఆయన సూచనలను పాటించి తన ఆటతీరులో మార్పు చేసుకున్నాడు. ఆ సలహాలే తనలో ఆత్మవిశ్వాసాన్ని నింపాయని వెల్లడించాడు.ఇటీవల కొన్ని మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోవడంతో వైభవ్ కొంత ఒత్తిడికి గురయ్యాడు. బ్యాటింగ్‌లో తాను చేస్తున్న తప్పులను గుర్తించేందుకు ప్రయత్నించాడు. ముఖ్యంగా క్రీజులోకి వచ్చిన వెంటనే భారీ షాట్లకు ప్రయత్నించడం వల్ల వికెట్ కోల్పోతున్నానని గుర్తించాడు. ఈ సమస్యను అధిగమించేందుకు తన తండ్రి, చిన్ననాటి కోచ్ మనీష్ ఓజా, అండర్-19 సహచరుడు ప్రథమ్ జాచక్‌తో చర్చించాడు. ఈ క్రమంలో తన అభిమాన క్రికెటర్ యువరాజ్ సింగ్‌ను కూడా సంప్రదించాడు. సుమారు అరగంట పాటు సాగిన ఫోన్ సంభాషణలో తన బ్యాటింగ్ సమస్యలను వివరించాడు. యువరాజ్ కూడా వైభవ్ ఆటతీరును విశ్లేషించి పలు కీలక సూచనలు చేశాడు.**20 బంతులు ఆడితే ఆటతీరే మారుతుంది!** క్రీజులోకి వచ్చిన వెంటనే దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించకుండా మొదట పరిస్థితులను అర్థం చేసుకోవాలని యువరాజ్ సూచించాడు. తొలి 20 బంతులు ఆత్మవిశ్వాసంతో ఆడాలని, ఆ తర్వాత సహజమైన ఆటను కొనసాగించాలని సలహా ఇచ్చాడు. ప్రారంభంలో ప్రతి బంతినీ బౌండరీకి తరలించాలనే ఆలోచన వద్దని, బంతి స్వభావం, పిచ్ పరిస్థితులను గమనిస్తూ ఆడాలని వివరించాడు. తొలి 20 బంతులు ఆడగలిగితే ఆ తర్వాత బ్యాటింగ్ మరింత సులభమవుతుందని చెప్పాడు. ఈ సూచనలు వైభవ్‌పై ప్రభావం చూపాయి. తన బ్యాటింగ్ వీడియోలను పరిశీలించి తప్పులను సరిదిద్దుకునే ప్రయత్నం చేశాడు. యువరాజ్ చెప్పిన విషయాలను ఆచరణలో పెట్టాలని నిర్ణయించుకున్నాడు. **53 బంతుల్లో 204 పరుగుల విధ్వంసం** యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ తన బ్యాటింగ్ ప్రతాపాన్ని చూపించాడు. ఆరంభం నుంచే ఆత్మవిశ్వాసంతో ఆడుతూ బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించాడు. కేవలం 28 బంతుల్లోనే శతకం పూర్తి చేసి సంచలనం సృష్టించాడు. అనంతరం మరింత దూకుడు పెంచి 40 బంతుల్లో 150 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. కేవలం 52 బంతుల్లోనే ద్విశతకం సాధించి మరో అరుదైన ఘనతను అందుకున్నాడు. మొత్తం 53 బంతుల్లో 28 సిక్సర్లు, ఏడు ఫోర్లతో 204 పరుగులు చేశాడు. అతడి ఇన్నింగ్స్‌లో సిక్సర్ల సంఖ్యే 28 కావడం అతడి విధ్వంసకర బ్యాటింగ్‌కు నిదర్శనం. ప్రత్యర్థి బౌలర్లు ఎలాంటి వ్యూహం అమలు చేసినా వైభవ్ దూకుడును అడ్డుకోలేకపోయారు.ఈ ఇన్నింగ్స్‌తో లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా శతకం, ద్విశతకం సాధించిన ఆటగాడిగా వైభవ్ రికార్డులు సృష్టించాడు. తన అసాధారణ బ్యాటింగ్‌తో అంతర్జాతీయ క్రికెట్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాడు. చిన్న వయసులోనే ఇంతటి భారీ ఇన్నింగ్స్ ఆడటం అతడి ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది. ముఖ్యంగా ఒత్తిడిని అధిగమించి, తన సహజమైన ఆటతీరును ప్రదర్శించడం విశేషం. **భారత్-ఎ జట్టుకు ఘన విజయం** వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర ఇన్నింగ్స్ కారణంగా భారత్-ఎ జట్టు భారీ లక్ష్యాన్ని అలవోకగా ఛేదించింది. యూఏఈ నిర్దేశించిన 250 పరుగుల లక్ష్యాన్ని కేవలం 14.2 ఓవర్లలోనే అందుకుంది. ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరుకుంది. వైభవ్ 204 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యే సమయానికి భారత్ విజయానికి కేవలం ఐదు పరుగులే అవసరమయ్యాయి. అనంతరం రింకూ సింగ్ సిక్సర్‌తో విజయాన్ని ఖరారు చేశాడు. ఈ మ్యాచ్‌లో వైభవ్ ప్రదర్శన టోర్నీలోనే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. **గురువు మాట.. ఆటగాడికి కొండంత బలం** యువరాజ్ సింగ్ భారత క్రికెట్‌లో విధ్వంసకర బ్యాటర్‌గా ప్రత్యేక గుర్తింపు పొందాడు. ముఖ్యంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఒత్తిడిని అధిగమించి మ్యాచ్‌లను మలుపుతిప్పిన అనుభవం ఆయనకు ఉంది. యువ ఆటగాళ్లకు తన అనుభవాన్ని పంచుతూ వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు ప్రయత్నిస్తుంటాడు. వైభవ్ విషయంలోనూ అదే జరిగింది. ఒక యువ ఆటగాడు తన సమస్యను గుర్తించి, అనుభవజ్ఞుడైన క్రికెటర్ సలహా తీసుకుని, దానిని మైదానంలో అమలు చేస్తే ఎలాంటి ఫలితం సాధించవచ్చో ఈ ఇన్నింగ్స్ చాటిచెప్పింది.మ్యాచ్ అనంతరం వైభవ్ మాట్లాడుతూ.. యువరాజ్ సింగ్ తన అభిమాన ఆటగాడని, ఆయన ఇచ్చిన సలహాలను శ్రద్ధగా విన్నానని తెలిపాడు. బ్యాటింగ్‌లో ఎదురవుతున్న సమస్యలను అధిగమించేందుకు యువరాజ్ సూచనలు ఎంతో ఉపయోగపడ్డాయని పేర్కొన్నాడు. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని తన సహజమైన ఆటను కొనసాగించానని వివరించాడు. కేవలం ప్రతిభ ఉంటేనే సరిపోదని, సరైన సమయంలో సరైన సలహాలు కూడా ఆటగాడి ప్రదర్శనను మెరుగుపరుస్తాయని వైభవ్ ఇన్నింగ్స్ నిరూపించింది.**భవిష్యత్తుపై భారీ అంచనాలు** వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే తన అసాధారణ బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానుల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. చిన్న వయసులోనే భారీ షాట్లు ఆడగల సామర్థ్యం, వేగంగా పరుగులు సాధించే నైపుణ్యం అతడిని ప్రత్యేక ఆటగాడిగా నిలబెడుతున్నాయి. అయితే ఈ విజయాలతోనే సంతృప్తి చెందకుండా నిలకడైన ప్రదర్శన కొనసాగించడం అతడికి అత్యంత ముఖ్యం. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే సాంకేతిక నైపుణ్యంతో పాటు మానసిక దృఢత్వం, క్రమశిక్షణ కూడా అవసరం.మొత్తంగా యువరాజ్ సింగ్‌తో జరిగిన అరగంట సంభాషణ వైభవ్ ఆటతీరులో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందనే విషయం అతడి ప్రదర్శనతో స్పష్టమైంది. ఒకవైపు అనుభవజ్ఞుడైన ఆటగాడి మార్గదర్శకత్వం, మరోవైపు యువ ఆటగాడి పట్టుదల కలిస్తే ఎలాంటి అద్భుతాలు సాధ్యమవుతాయో ఈ మ్యాచ్ తెలియజేసింది. 53 బంతుల్లో 204 పరుగుల ఇన్నింగ్స్‌తో వైభవ్ సూర్యవంశీ తన పేరును రికార్డుల పుటల్లో లిఖించుకున్నాడు. రానున్న రోజుల్లో భారత క్రికెట్‌లో మరిన్ని సంచలనాలు సృష్టిస్తాడని అభిమానులు ఆశిస్తున్నారు.



# కమిన్స్ మాటలు నన్ను బాధించాయి

**● వ్యక్తిగతంగా విమర్శిస్తాడని ఊహించలేదు.. అతనిపై ఇప్పటికీ అభిమానం ఉంది: ఉస్మాన్ ఖవాజా**

**ఇంటర్నెట్ డెస్క్:** ఆస్ట్రేలియా క్రికెట్‌లో 2018లో చోటుచేసుకున్న బాల్ ట్యాంపరింగ్ (శాండ్‌పేపర్) వివాదం మరోసారి చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై తన ఆత్మకథ లిసబ్రిలిలో జట్టులోని సభ్యులందరికీ ముందే తెలుసని పేర్కొన్న మాజీ ఆటగాడు ఉస్మాన్ ఖవాజా.. తాజాగా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చేసిన వ్యాఖ్యలపై స్పందించాడు.కమిన్స్ నిర్వహించిన సుదీర్ఘ ప్రెస్‌మీట్‌లో తనపై వ్యక్తిగత విమర్శలు చేయడం తీవ్రంగా బాధించిందని ఖవాజా తెలిపాడు. "ప్యాట్ కమిన్స్‌ను వ్యక్తిగతంగా, నాయకుడిగా ఎంతో ఇష్టపడతాను. కానీ అతను నాపై ఈ విధంగా బహిరంగంగా వ్యక్తిగత దాడికి దిగుతాడని ఊహించలేదు. గతంలో అతనిలో ఇలాంటి కోణాన్ని చూడలేదు. అందుకే తీవ్ర నిరాశకు గురయ్యాను" అని చెప్పాడు.ప్రెస్‌మీట్ చూస్తున్న సమయంలో తన భార్య రేచల్ పక్కనే ఉండి పదేపదే క్షేమం అడిగిందని, ఆ సమయంలో భావోద్వేగానికి గురై సమాధానం కూడా చెప్పలేకపోయానని వెల్లడించాడు.ఈ వివాదంలో తన సమస్య కమిన్స్‌తో కాదని, క్రికెట్ ఆస్ట్రేలియా వ్యవహరించిన తీరుతోనేనని ఖవాజా స్పష్టం చేశాడు. జట్టులో నెలకొన్న 'ఎలాగైనా గెలవాలి' అనే ధోరణికి క్రికెట్ ఆస్ట్రేలియా బాధ్యత వహించాలని అభిప్రాయపడ్డాడు. ఈ వ్యవహారంలో సంస్థే ముందుకొచ్చి నాయకత్వం వహించాల్సిందన్నాడు.కమిన్స్‌పై తనకు ద్వేషం లేదని, ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యల ఆధారంగా అతడిపై శాశ్వత అభిప్రాయం ఏర్పరుచుకోనని తెలిపాడు. "ఆ మాటలు నన్ను బాధించినా.. ప్యాట్‌పై నాకు ఎప్పటికీ అభిమానం ఉంటుంది" అని ఖవాజా పేర్కొన్నాడు.

# వన్డేల్లో వైభవ్ ట్రిపుల్ సెంచరీ ఖాయం!

**- రికార్డులు బద్దలు కొట్టాలంటే క్రిస్ గేల్ మళ్లీ రావాల్సిందే.. చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా ధీమా**



ఇంటర్నెట్ డెస్క్: భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీపై అతడి చిన్ననాటి కోచ్ మనీశ్ ఓజా ప్రశంసలు కురిపించాడు. భవిష్యత్తులో వైభవ్ వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ సాధించే సత్తా ఉందని ధీమా వ్యక్తం చేశాడు. ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈపై కేవలం 53 బంతుల్లో 204 పరుగులు చేసి వైభవ్ ప్రపంచ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే.రెండేళ్ల క్రితమే వైభవ్ డబుల్ సెంచరీ సాధిస్తాడని తాను అంచనా వేసినట్లు ఓజా తెలిపాడు. అతడి ప్రస్తుత ఆటతీరును చూస్తుంటే 300 పరుగులు చేయడం కూడా అసాధ్యమేమీ కాదన్నాడు. యూఏఈపై ఆడిన ఇన్నింగ్స్ దూకుడు, వినోదం, అద్భుతమైన బ్యాటింగ్‌తో కూడిన అసాధారణ ప్రదర్శనగా అభివర్ణించాడు. 14-15 ఓవర్లలోనే 250 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే సత్తా ఉన్న వైభవ్.. ఇదే దూకుడుతో 50 ఓవర్లు ఆడితే భారీ స్కోరు సాధించగలడని పేర్కొన్నాడు.ప్రస్తుతం వైభవ్ నెలకొల్పుతున్న రికార్డులను బద్దలు కొట్టే ఆటగాడు కనిపించడం లేదని, వాటిని అధిగమించాలంటే వెస్టిండీస్ దిగ్గజం క్రిస్ గేల్ మళ్లీ మైదానంలోకి రావాల్సిందేనని సరదాగా వ్యాఖ్యానించాడు.

# ఐపీఎల్ వేలంలోకి సెహ్వాగ్ తనయుడు!

**● రూ.30 లక్షల కనీస ధరతో ఆర్యవీర్ పేరు నమోదు.. అండర్-19 ఆసియా కప్‌లో 361 పరుగులతో సత్తా**



న్యూఢిల్లీ: టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ ఐపీఎల్-2027 మినీ వేలంలో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. ఈ మేరకు వేలం కోసం తన పేరును నమోదు చేసుకున్నాడు. రూ.30 లక్షల కనీస ధరతో వేలం బరిలోకి దిగుతున్నాడు. ఇటీవల ముగిసిన అండర్-19 ఆసియా కప్‌లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న ఆర్యవీర్.. ఇప్పుడు ఐపీఎల్ ఫ్రాంచైజీల దృష్టిని ఆకర్షించేందుకు సిద్ధమయ్యాడు.తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ మాదిరిగానే ఆర్యవీర్ కూడా కుడిచేతి వాటం ఓపెనింగ్ బ్యాటర్. ఇటీవల ఒమన్ వేదికగా జరిగిన అండర్-19 ఆసియా కప్‌లో భారత జట్టు తరపున నిలకడగా రాణించాడు. ఐదు మ్యాచ్‌ల్లో 361 పరుగులు సాధించి టోర్నీలో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. 90.25 సగటు, 95.50 స్ట్రైక్‌రేట్‌తో బ్యాటింగ్ చేసి ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఒక సెంచరీతో పాటు మూడు అర్ధసెంచరీలు సాధించి తన ప్రతిభను చాటాడు.ఈ టోర్నీలో ఆర్యవీర్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో 168 బంతుల్లో 160 పరుగులు చేసి తన బ్యాటింగ్ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. సెమీఫైనల్లో అఫ్గానిస్థాన్‌పై 51 పరుగులు చేయగా, పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో 58 పరుగులతో రాణించాడు. కీలకమైన ఫైనల్లో కెప్టెన్ లక్ష్య రైచందానితో కలిసి తొలి వికెట్‌కు 95 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. చివరి బంతికి పాకిస్థాన్‌ను ఓడించి భారత్ అండర్-19 ఆసియా కప్ టైటిల్‌ను కైవసం చేసుకుంది.ఆర్యవీర్‌తో పాటు మరో యువ ఆటగాడు మోహిత్ ఉల్వా కూడా ఐపీఎల్ వేలానికి పేరును నమోదు చేసుకున్నాడు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# మళ్లీ యాక్షన్ హీరోగా శరత్‌కుమార్.. 177వ చిత్రానికి 'టాక్సీ' టైటిల్




సీనియర్ నటుడు, రాజకీయ నాయకుడు శరత్‌కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న 177వ చిత్రానికి 'టాక్సీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. మంగళవారం చెన్నైలో ఈ సినిమా పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. సుదీర్ఘ విరామం తర్వాత శరత్‌కుమార్ ఈ చిత్రంలో పూర్తిస్థాయి యాక్షన్ రోల్‌లో కనిపించనున్నాడు.పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రానికి ధన దర్శకత్వం వహిస్తున్నాడు. గతంలో శరత్‌కుమార్ ప్రధాన పాత్రలో ఆయన తెరకెక్కించిన 'వానం కొట్టటుం' విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బెర్జయ గ్రూప్ ఆఫ్ కంపెనీస్, రాడాన్ మీడియా వర్క్స్ ఇండియా లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.ఈ సినిమా ప్రారంభోత్సవానికి దిగ్గజ దర్శకుడు మణిరత్నం ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన దర్శకుడు ధనను అభినందిస్తూ, చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలియజేశాడు. గతంలో ధన.. మణిరత్నం వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశాడు.ఈ చిత్రానికి ప్రముఖ రచయిత బి. జయమోహన్ కథను అందిస్తుండగా, జస్టిన్ ప్రభాకరన్ సంగీతం సమకూరుస్తున్నాడు. నవీన్ కుమార్ ఛాయాగ్రహణ బాధ్యతలు చేపట్టగా, సిల్వా మాస్టర్ యాక్షన్ కొరియోగ్రఫీని పర్యవేక్షిస్తున్నాడు. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని చిత్ర బృందం పేర్కొంది.

# గర్వంగా ఉంది..

## మిస్ యూనివర్స్ 2026కజియా లిజ్ మేజోపై సుస్మితా సేన్ ప్రశంసల జల్లు



75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించిన మిస్ యూనివర్స్ ఇండియా 2026 కజియా లిజ్ మేజోపై బాలీవుడ్ నటి, మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్ ప్రశంసల వర్షం కురిపించారు. అంతర్జాతీయ వేదికపై కజియా ప్రదర్శన ఎంతో గర్వకారణంగా ఉందని ఆమె పేర్కొన్నారు.
ప్యూర్టో రికోలోని శాన్ జువాన్ నగరంలో గల జోస్ మిగ్యుల్ అగ్రెలట్ కొలీసియంలో 75వ మిస్ యూనివర్స్ గ్రాండ్ ఫినాలే ఘనంగా జరిగింది. ఈ పోటీల్లో కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని కజియా లిజ్ మేజో భారత్ తరఫున బరిలోకి దిగారు. మొత్తం 116 దేశాల సుందరీమణులు పాల్గొన్న ఈ పోటీల్లో ఆమె టాప్ 30 సెమీఫైనలిస్టులలో ఒకరిగా నిలిచారు. అయితే, తదుపరి రౌండైన టాప్ 12లోకి ఆమె ప్రవేశించలేకపోయారు. కేరళ నుంచి మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని గెలుచుకున్న తొలి యువతిగా కజియా రికార్డు సృష్టించారు.
ఈ పోటీల అనంతరం సుస్మితా సేన్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో కజియా ఫొటోను షేర్ చేస్తూ భావోద్వేగ సందేశాన్ని రాసుకొచ్చారు. "నువ్వు కేవలం పాల్గొనడమే కాదు, ప్రతి క్షణాన్ని నీ సొంతం చేసుకున్నావు. ఎంతో హుందాతనం, తెలివితేటలు, ధైర్యంతో కూడిన హృదయంతో పోటీపడ్డావు. నువ్వు అందరి మనసులను గెలుచుకున్నావు. భారతదేశానికి ఇంతటి అద్భుతమైన ప్రాతినిధ్యం వహించినందుకు నిన్ను చూసి ఎంతో గర్వపడుతున్నాను. ఇలాగే మెరుస్తూ ఉండు, నువ్వు దీని కోసమే పుట్టావు" అని సుస్మిత కొనియాడారు.
1994లో మిస్ యూనివర్స్ కిరీటాన్ని సుస్మితా సేన్ కైవసం చేసుకున్నారు. కాగా, ఈ 75వ మిస్ యూనివర్స్ టైటిల్‌ను ప్యూర్టోరికోకు చెందిన జెన్నిఫర్ బారెటో గెలుచుకున్నారు.




# సంబరాల బాబు సౌండ్ గట్టిగానే చేయాలి!



సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తోన్న భారీ యాక్షన్ చిత్రం -సంబరాల ఏటిగట్టు-పై అభిమానుల్లో ఎన్నో అంచనాలున్నాయి. నిజానికి ఈ సినిమా ఇప్పటికే రిలీజ్ అవ్వాలి. కానీ వివిధ కారణాల వల్ల విడుదల వాయిదా పడుతోంది. సంక్రాంతి కానుకగా జనవరి 12న చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. చాలా గ్యాప్ తర్వాత సాయి తేజ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో సంక్రాంతి రేసులో బాక్సాఫీస్ వద్ద గట్టిగానే సౌండ్ చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. అయితే సంక్రాంతి బరిలో నిలవడం అంటే సులువైన విషయం కాదు. జనవరి 12న విడుదల అంటున్నా? అదే సమయంలో మరికొన్ని క్రేజీ సినిమాలు కూడా పోటీలో ఉన్నాయి. మేనమామ మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న -కాకా- చిత్రం కూడా సంక్రాంతి సీజన్‌లోనే రిలీజ్ అవుతుంది. ఒకవైపు మెగాస్టార్ లాంటి దిగ్గజ హీరో సినిమా- మరోవైపు ఇతర అగ్ర హీరోల చిత్రాల నడుమ -సంబరాల ఏటిగట్టు- ఉనికిని చాటుకోవాలంటే ప్రమోషన్ల విషయంలో పెద్ద కసరత్తు చేయాల్సిందే.ఇంత తీవ్రమైన పోటీని తట్టుకుని ప్రేక్షకులను థియేటర్లకు రప్పించాలంటే ప్రచార హోరు తారెత్తిపోయేలా ఉండాలి. కానీ విడుదల తేదీ దగ్గరపడుతున్నా? ఇప్పటి వరకు చిత్ర బృందం నుంచి ఆ స్థాయి హడావుడి ఇంకా మొదలు కాలేదు. టీజర్లు.. పాటలు.. వరుస అప్‌డేట్లతో సోషల్ మీడియాలో వాతావరణాన్ని వేడెక్కించాల్సిన సమయం ఆసన్నమైంది. సాయి తేజ్ కెరీర్ పరంగా చూస్తే -బ్రో- తర్వాత ఆయన నుంచి మరో సినిమా వచ్చి చాలా కాలమైంది. సుదీర్ఘ విరామం తర్వాత వస్తున్న -సంబరాల ఏటిగట్టు-లో సరికొత్త మేకోవర్‌తో.. రస్టిక్ యాక్షన్ అవతార్‌లో కనిపించ బోతున్నాడు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ చిత్రం కథాబలం.. విజువల్స్‌పై మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నా? ఆ విషయాన్ని ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లడం ఇప్పుడు అత్యంత కీలకమైంది. సంక్రాంతి సీజన్‌లో ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు మాస్ ప్రేక్షకుల ఆదరణ దక్కాలంటే కంటెంట్ బాగుంటే సరిపోదు. పక్కా ప్లానింగ్‌తో కూడిన పబ్లిసిటీ కూడా అంతే అవసరం. ఇంటర్వ్యూలు, ప్రీ-రిలీజ్ ఈవెంట్లు, వినూత్న ప్రచార కార్యక్రమాలతో సాయి తేజ్ స్వయంగా రంగంలోకి దిగి సినిమాపై హైప్ పెంచాల్సి ఉంది. సంక్రాంతి పోటీలో నిలబడి విజయం సాధించాలంటే సంబరాల బాబు ప్రచార వేగాన్ని తక్షణమే పెంచాలి. మరి ఈ విషయంలో టీమ్ ఎలాంటి వ్యూహంతో ముందుకెళ్తుందో చూడాలి

# ఆషిఖి రేంజు మ్యూజికల్ లవ్ స్టోరీలో దురంధర్ బ్యూటీ

ధురంధర్- ఫేమ్ సారా అర్జున్ తొలిసారి ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌లో ఓ భారీ ప్రాజెక్ట్‌ను దక్కించుకున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో కథనాలు వినిపిస్తున్నాయి. కెరీర్ ఆరంభమే ఒక భారీ స్పై థ్రిల్లర్ కథాంశంలో నటించి మెప్పించిన సారా, ఈసారి తన వయసుకు తగ్గట్టు ఒక అద్భుతమైన మ్యూజికల్ లవ్ స్టోరీలో నటించబోతోంది. ఇది ఆషిఖి రేంజులో ఉంటుందని కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. టైగర్ 3 (2023) చిత్రానికి దర్శకత్వం వహించిన మనీష్ శర్మ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా.. 2027 జనవరిలో పంజాబ్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌లో -సప్నే వర్సెస్ ఎవ్రీవన్- ఫేమ్ నటుడు అంబ్రీష్ వర్మ కూడా కీలక పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. కథాంశంలో సంగీతానికి అత్యంత ప్రాధాన్యత ఉండేలా మొత్తం ఎనిమిది పాటలతో ఈ మ్యూజికల్ రొమాన్స్ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సినీ వర్గాల సమాచారం. ఇతర పాత్రధారుల వివరాలతో పాటు వైఆర్ఎఫ్ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. గతంలో బ్యాండ్ బాజా బారాత్ (2010), శుద్ధ్ దేసీ రొమాన్స్ వంటి రొమాంటిక్ చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మనీష్ శర్మ.. చాలా కాలం తర్వాత మళ్లీ రొమాన్స్ జానర్‌లోకి అడుగుపెడుతున్నారు. సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్‌లతో -టైగర్ 3- వంటి యాక్షన్ సినిమా చేసిన తర్వాత ఇప్పుడు అంతా యూత్‌తో మ్యూజికల్ ప్రేమకథను ఎంచుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. సారా అర్జున్‌కు ఇది వైఆర్ఎఫ్ సంస్థలో తొలి సినిమా కావడంతో, తన కెరీర్‌లో ఇది మరో కీలక మలుపుగా నిలుస్తుందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అంతేకాదు.. మనీష్‌శర్మ ఆషిఖి ఫ్రాంచైజీ సినిమాలు, సయ్యారాలకు భిన్నంగా ఒక కొత్తదనం నిండిన స్క్రిప్టుతో మెప్పించాల్సి ఉంటుంది. దర్శకుడిగా ఇది అతడికి సవాల్ లాంటిది.సారా అర్జున్ బాలనటిగా తమిళం, తెలుగు చిత్రాలలో నటించింది. తమిళ దర్శకుడు విజయ్ తెరకెక్కించిన నాన్న చిత్రంతో తెలుగులోను సుపరిచితం. అప్పట్లో క్యూట్ లుక్స్‌తో బాలనటిగా ఆకట్టుకుని, ఆ తర్వాత యుక్తవయసులో రణ్ వీర్ సింగ్ లాంటి సీనియర్ ఏజ్డ్ హీరో సరసన కథానాయికగా నటించడంతో విమర్శలు ఎదురయ్యాయి. కానీ దురంధర్ సక్సెస్ ముందు విమర్శలేవీ నిలబడలేదు. చివరికి సారా అద్భుతంగా నటించిందని ప్రశంసలు దక్కాయి. అందుకే ఇప్పుడు మ్యూజికల్ లవ్ స్టోరీలో తన పాత్ర ఎలా ఉండబోతోందో చూడాలనే క్యూరియాసిటీ నెలకొంది.

# ఉత్కంఠ రేపుతున్న 'నాట్ ఎ మహాత్మా'..

## కేసీఆర్ దీక్షపై ఏం చూపించబోతున్నారు?



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన ఘట్టం 2009 నాటి ఆమరణ నిరాహార దీక్ష. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమాన్ని మలుపు తిప్పిన ఈ దీక్ష నేపథ్యంతో 'నాట్ ఎ మహాత్మా' పేరుతో ఒక డాక్యుమెంటరీ వెబ్ సిరీస్ రాబోతోంది. తాజాగా ఈ సిరీస్‌కు సంబంధించిన ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది.
అహింసా మార్గంలో మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్ర్యం సాధిస్తే, అదే పంథాలో కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని పోలుస్తూ, ఆ చారిత్రక దీక్ష వెనుక అసలు నిజం ఏంటి? అనే కోణంలో ఈ సిరీస్‌ను రూపొందించినట్టు మేకర్స్ చెబుతున్నారు. నాలుగు ఎపిసోడ్లుగా రానున్న ఈ డాక్యుమెంటరీలో 2009 నాటి వాస్తవాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది.'ఓయ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన ఆనంద్ రంగ ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, నాటి రాజకీయ పరిణామాలను లోతుగా విశ్లేషిస్తూ ఈ సిరీస్‌ను ఆసక్తికరంగా మలిచినట్టు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. 'అనగనగా ఫిల్మ్ కంపెనీ' బ్యానర్‌పై పట్టాభి ఆర్ చిలుకూరి నిర్మించిన ఈ సిరీస్‌కు ముత్యాల సుధీర్ రెడ్డి సహ-దర్శకుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం ఈ ట్రైలర్, తెలంగాణ చరిత్రలోని ఈ కీలక అధ్యాయంపై ప్రేక్షకుల్లో అంచనాలను పెంచుతోంది.



# 'ఆకాశంలో ఒక తార' కు చిరు ప్రశంసలు

'ఆకాశంలో ఒక తార' చిత్రంపై మెగాస్టార్ చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఈ సినిమా తన మనసును ఎంతో కదిలించిందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు చిత్ర బృందాన్ని అభినందిస్తూ సోషల్ మీడియా వేదికగా చిరంజీవి ఒక ప్రత్యేక పోస్ట్ చేశారు. ఇంతటి స్ఫూర్తిదాయకమైన కథను ఎంతో నమ్మకంతో, అత్యద్భుతంగా తెరకెక్కించిన దర్శకుడు పవన్ సాధినేనిని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. ముఖ్యంగా సినిమా సెకండాఫ్ తనను ఎంతగానో భావోద్వేగానికి గురిచేసిందని చిరంజీవి వివరించారు.చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించిన దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి తమ సహజ సిద్ధమైన నటనతో పాత్రలకు ప్రాణం పోశారని మెగాస్టార్ కొనియాడారు. అలాగే శ్రుతి హాసన్, రుహానీ శర్మతో పాటు ఇతర నటీనటులందరూ తమ తమ పాత్రలకు పూర్తి న్యాయం చేశారని పేర్కొన్నారు. సాంకేతిక నిపుణుల పనితీరును ప్రస్తావిస్తూ.. జీవీ ప్రకాశ్ అందించిన సంగీతం, సుజిత్ సారంగ్ సినిమాటోగ్రఫీ కథలోని భావోద్వేగాలను మరింత లోతుగా ప్రేక్షకుల మనసుకు హత్తుకునేలా చేశాయని అభినందించారు. చిత్రంలోని ప్రతి సాంకేతిక విభాగం పనితీరు ఎంతో అభినందనీయంగా ఉందని చెప్పారు.



Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613